# సాహితీ కెరటాలు

website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 8-12-2022


## నానీలు

నాగటి చాలులో
స్వేద పరిమళం
శ్రమజీవి నుదుట
సౌందర్యం.

సిరులు పండే
భూములే..
ప్లాట్లు ప్లాట్లుగా
గుండెనిండా గాట్లు గాట్లు

అతడు
మానవత్వపు జెండా
వేరొకరికి
ఊపిరి పోయడం ఎజెండా!

తుఫాను
పోరుకాదది
వినిపించేది
రైతు విషాద గీతం.



-బొమ్ము ఉమా
మహేశ్వర రెడ్డి
సెల్:94402 14705

## ఘంటారావం

గడియారం ఆపితే
ఘడియ ఆగుతుందా?
నీడను నిర్బంధిస్తే
నాడి ఆగుతుందా?

అబద్ధాలు హద్దులు
దాటితే ఎలా?
పోగొట్టుకున్న నమ్మకాన్ని
రాబట్టుకోలేము కదా

గుండెకు
గాయం చేయకు
సుడిగుండం
సృష్టించకు.



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

## నేడు భజన..!!

ఉన్నదాన్నో
ఉన్నట్లున్నదాన్నో..
ఉన్నతోన్నతంగా
కీర్తించి
జపించేదే భజన..!

గోరంతను
కొండంతలుగా
ఊరించి ఊదరగొట్టి
స్తుతించి
స్తోత్రించేదే భజనంటే..!

ఉన్నపళంగా
ఉనికి మారాలన్నా..
గబుక్కున గమ్యం చేరాలన్నా
కొందరాశ్రయించేది
ఈ తొవ్వనే ..!

తేరగా వరాలైనా
తేలికగా అనుగ్రహాలైనా..
తాళాలూ..
తప్పెట్లను జోడించి
ఊగిపోతూ ఆలపించేదే
భజన.!

భజనలకు
తలవంచనిది
పరవశించనిది ఎవరనీ.!?
రాతి ప్రతిమల నుంచి
రారాజుల దాకా
తన్మయులై
మైమరచిపోరూ..!
"రాజాధి రాజా రాజ గంభీరవా"

ఏలికల కొలువుల్లో
భజనపరులుకే
ముందు సీటూ పెద్ద పీటా
సత్కార సన్మానాలూనూ..!

భజనలూ కీర్తనలూ
మానసిక బలహీనత లోంచి
మొలకెత్తినవే అయినా
ఆశించిన ఫలితాలని
అందజేస్తాయని కొందరి
వాదన..!

ఇంతటి
అపూర్వ భజనలని
ఆస్వాదించడం వాటిని ఆలపించడం
నాకెందుకో అబ్బలేదు.!
ఫలితంగా..
అవకాశాలు దారిమళ్ళి
దూరం పోతున్నా..
వాస్తవంలోనే ఆనందంగా
జీవిస్తూంటా .!!



-నాంపల్లి సుజాత
9848059893

## పాత్రికేయులకు మార్గదర్శి నార్ల

పాత్రికేయుడిగా గొప్ప విలువల తో నార్ల వెంకటేశ్వరరావు జీవించారని సీనియర్ పాత్రికేయుడు, తెలం గాణ ప్రభుత్వ సలహాదారు టంకశాల అశోక్ అన్నారు. నార్ల జయంతిని పురస్కరించుకొని డాక్టర్ బీ.ఆర్. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో మంగళ వారం స్మారకోపన్యాసం చేశారు. నార్ల మూడు పదుల వయస్సులోనే అంతర్జాతీయ పరిణామాలపై వ్యాసాలు, పుస్తకాలు రాశారన్నారు. ప్రస్తుతం యువ జర్నలిస్టులతో విషయ పరిజ్ఞా నం, అధ్యయనం లోపిస్తోందని, ఇది సమాజానికి మంచి చేయదన్నారు. వైస్ ఛాన్సలర్ కె. సీతారామారావు మాట్లాడుతూ నార్ల కుటుంబ సభ్యులు ఆయన రాసిన, సేకరించిన పుస్తకాలను యూనివర్సిటీ లైబ్రరీకి అందించారన్నారు. వీటిని డిజిటలైజ్ చేస్తామన్నారు. వర్సి టీ అకడమిక్ డైరెక్టర్ ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ ఏవీఎన్ రెడ్డి ప్రసంగించారు.



అంబేడ్కర్ వర్సిటీలో నార్లకు నివాళులర్పిస్తున్న సీనియర్ పాత్రికేయులు టంకశాల అశోక్, వీసీ కె. సీతారామారావు, ఘంటా చక్రపాణి తదితరులు.



పుస్తక సమీక్ష

## నందిని సిధారెడ్డి కవిత్వ జీవన ప్రస్థానం.. 'శిఖరం'




ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నందిని సిధారెడ్డి పేరు వినని సాహితీ ప్రియులు వుండరనడంలో అతిశయోక్తి లేదు. కవిగా, పాటల రచయితగా సినీ గేయ కవిగా, అనువాదకుడిగా, సంపాదకుడిగా కథకుడిగా, వ్యాసకర్తగా, ఉపన్యాసకుడిగా తెలంగాణ సాంస్కృ తిక ప్రచారకుడిగా తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడిగా బహుముఖీన ప్రజ్ఞావంతుడైన సిధారెడ్డి జీవన. సాహిత్య ప్రస్థానాలను ప్రస్తుతిస్తూ డా॥గంటా జలంధర్ రెడ్డి సంపాదకత్వంలో వెలువడిన ఉద్గ్రంథం 'శిఖరం'. 26 ప్రముఖ రచయితల వ్యాస సమా హారం యిది. స్వయంకృషితో, తాను నమ్మిన సిద్ధాంతాలతో ఒక సామా న్యుడు అసామాన్యుడిలా ఎదిగి కీర్తి శిఖరాలను అధిరోహించిన తీరును ఆస్వాదించవచ్చు. సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన సిధారెడ్డి స్వస్థలం మెదక్ జిల్లాలో సిద్ధిపేట సమీపంలోని బందారం. తల్లిదండ్రులు రత్నవ్వ, బాల సిద్ధారెడ్డిగారలు. తండ్రి తెలంగాణ సాయుధ పోరాటవీరుడు. దొరలు, భూస్వా ములు, రజాకార్లకు ఎదురొడ్డి వేలాది ఎకరాలను పేదలకు పంచిన కమ్యూనిస్టు యోధుడు. తండ్రి పోరాట పటిమను పుణికి పుచ్చుకున్న సిధారెడ్డి తనదైన ప్రత్యేక వ్యక్తిత్వంతో ఎదిగొచ్చాడు. తల్లిదండ్రులు పెట్టిన పేరు నర్రసిద్ధారెడ్డి. కానీ ఆ రోజుల్లో నర్రసిద్ధారెడ్డి పేరిట నలుగురు కవులు వుండటం, శీలం సిద్ధారెడ్డి వంటి ప్రముఖ రాజకీయ నాయకుడు వుండటం వల్ల కవిగా తన అస్తిత్వాన్ని నిలబెట్టుకునే ప్రయత్నంలో తన యింటి పేరును నందిగా మార్చుకున్నాడు. నర్ర అంటే ఎద్దు. కాబట్టి 'నంది' అన్నా ఫర్వాలేదు అనుకున్నాడు. 'నంది' అంటే నిండుగా లేదు, 'నందిని' అంటే బాగుంటుందన్న పెద్దలు ఉమాపతి పద్మనాభశర్మ సూచన మేరకు ఇంటి పేరు నర్రా కాస్తా 'నందిని'గా రూపాంతరం చెందింది. అలాగే ఆధునిక కవి 'పఠాభి' పేరు స్ఫూర్తిగా తన పేరులోని ద్విత్వ'ద' కారం తీసేసి 'ధా'గా మార్చుకుని సిధారెడ్డిగా స్థిరపడ్డాడు. ఇదీ నందిని సిధారెడ్డి పేరు వెనకగల ముచ్చట.

బందారం, వెల్కటూర్ గ్రామాల్లో స్కూల్ విద్య పూర్తి చేసుకున్న సిధారెడ్డి సిద్ధిపేట ప్రభుత్వ కళాశాలలో 1972–1975 మధ్యకాలంలో ఇంటర్ మరియు డిగ్రీ విద్యాభ్యాసం కొనసాగించారు. కాలేజి రోజుల్లోనే ఆధునిక సాహిత్యం మీద మక్కువ కలిగి విస్తృత అధ్యయనం గావించి తాను గూడ కవిగా రూపాంతరం చెందాడు. 1974లో 'బిచ్చగాడు' కవితతో తన సాహితీ ప్రస్థానం మొదలైంది. యిప్పటి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, కాలేజి రోజుల్లో సిధారెడ్డి సహాధ్యాయి. సరిగ్గా ఈ అయిదు సంవత్సరాల కాలంలో నేను సిద్ధిపేట స్టేట్‌బ్యాంక్ ఆఫ్ హైద్రాబాద్ లో ఉద్యోగించాను. కాపు రాజయ్య, వేముగంటి నరసింహాచార్యులు, ఉమాపతి పద్మనాభశర్మ, శ్రీకాంతశర్మ వంటి సాహితీ దిగ్గజాల సాహచర్యం తో 'కళా స్రవంతి' సంస్థ ద్వారా అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఎందరో స్థానిక జానపద గాయకులు మరియు సిద్ధిపేటకు చెందిన నృత్య కళాకారుడు కటిక రమేష్‌కు వేదికను సమకూర్చి ప్రోత్సహించింది 'కళా స్రవంతి'. తర్వాతి కాలంలో అంతర్జాతీయ నృత్య కళాకారుడిగా (పేరిణీ శివతాండవం) గుర్తింపు పొందాడు రమేష్. సిద్ధిపేట ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ అధ్యక్షుడిగా కమ్యూనిస్టు నాయకులు మంగోల్ మొహినుద్దీన్, కేవల్ కిషోర్, సిరాజుద్దీన్‌గారల సారథ్యంలో అనేక కార్మికుల, శ్రామికుల ఉద్యమ కార్యక్రమాల్లో నేను పాల్గొన్న రోజులవి. ఆ అయిదు సంవత్సరాలు నా జీవితంలో మరిచిపోలేని ఉద్వేగ్న, చైతన్యభరిత క్షణాలు. సరిగ్గా అప్పట్లోనే విద్యార్థి ఉద్యమ నాయకుడిగా, కవిగా ఎదుగుతున్న సిద్ధిపేట కాలెజి విద్యార్థి సిధారెడ్డి పరిచయం కలుగకపోవడం ఓ విధంగా ఆశ్చర్యమే.

డిగ్రీ చదువు అయింతర్వాత సిధారెడ్డి ఉద్యమాలకు పురిటిగడ్డ అయిన ఉస్మానియా విశ్వ విద్యాల యంలో ఎంఏ చదవడం, డా॥సి. నారాయణరెడ్డిగారి పర్యవేక్షణలో ఎం.ఫిల్, పిహెచ్‌డి పూర్తి చేసుకుని తెలుగు ఉపన్యాసకుడిగా ఉద్యోగిం చడం సాహితీ ప్రియులందరకు తెలిసిందే.

నాలుగు దశాబ్దాల కాలంలో **దివిటి, భూమిస్వప్నం, సంభాషణ, ప్రాణహిత, ఒక బాధగాదు, నది పుట్టువడి** వంటి అద్భుత కవితా సంపుటాలు వెలువరించారు సిధారెడ్డి. ఫ్రీవర్స్ ఫ్రంట్, దాశరథి, రొట్టెమాకురేవు, తెలుగు విశ్వ విద్యాలయం వంటి ప్రతిష్టాత్మక పురస్కారాలు కైవసం చేసుకున్న కవిత్వం ఆయనది. అప్పటి ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా తెలుగు విశ్వ విద్యాలయం వారి ఉత్తమ కవితా పురస్కారం (ప్రాణ హిత–2001) తిరస్కరించి ప్రజల పక్షపాతిగా నిలిచిన విశిష్ట వ్యక్తిత్వం సిధారెడ్డిది.

సినీ గేయ రచయితగా **వీర తెలంగాణ, జైబోలో తెలంగాణ, బందూక్, నా భూమి, టూ కంట్రీస్,** వంటి ఉద్యమ చలన చిత్రాలకు పాటలు రాసిన అనుభవజ్ఞుడు. 2010 సం॥లో **'వీర తెలంగాణ'** చిత్రానికి సిధారెడ్డి రాసిన **'నాగేటి చాల్లల్ల'** పాటకు నంది అవార్డు దక్కడం ఆయన ప్రతిభకు తార్కాణం. కథా రచయితగా కూడా వివిధ కథల పోటీల్లో బహుమంతులందుకున్న సిధారెడ్డి అసంఖ్యాకంగా సాహితీ వ్యాసాలు కూడా రాశారు. కరుడుగట్టిన తెలంగాణ వాదిగా **"తెలంగాణ భాష–సంస్కృతి", "తెలంగాణ సాహిత్యం– కులవృ త్తులు", "ఆవర్తనం"** గ్రంథాల్లో ఆయన రాసిన సాహిత్య వ్యాసాలు ఎంతో స్ఫూర్తిదా యకంగా విజ్ఞానవంతంగా భాసిల్లినై. నృత్య రూపక రచనలో గూడ సిధారెడ్డి ప్రతిభ కొట్టొచ్చినట్టు కనబడ్తుంది. **"నా తెలంగాణ కోటి రతనాల వీణ" "మహాకవి దాశరథి", "అన్నదాత"** వంటి నృత్య రూపకాలు ఆయన రచనా శైలికి సాక్షీభూతంగా నిలుస్తయి.

2008–2010 సం॥ ఇంటర్మీ డియట్ తెలుగు పాఠ్య గ్రంథాలకు సంపాదకత్వం నెరపిన సిధారెడ్డి **'ఎడపాయలు'** కవితా సంకలనానికి, **"మంజీర, సోయి"** వంటి పత్రికలకు కూడ సంపాదకత్వం వహించి ఉత్తమాభిరుచి గల సంపాదకుడిగా వినుతికెక్కాడు. ఆయన స్థాపించిన **"మంజీరా రచయితల సంఘం", "తెలంగాణ రచయితల వేదిక",** వంటి అనేక సంస్థలు యిప్పటికీ సజీవంగా వుండి కార్యక్రమాలు నిర్వహించడం గమనార్హం. తెలుగు కవిగా జాతీయ స్థాయిలో అనేక సాహిత్య కార్యక్రమాల్లో ప్రాతినిధ్యం వహించి తెలుగువాడి సత్తా చాటి చెప్పాడు. సిధారడ్డి రచనలు హిందీ, ఆంగ్లం మళయాళం, తమిళం, కన్నడ, ఉర్దూ భాషల్లోకి అనువదింప బడి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాడు.

యిక **'శిఖరం'** గ్రంథంలోని వ్యాసాల విషయానికొస్తే.. డా॥.వి. శంకర్ **"సిధారెడ్డి జీవన రేఖలు– వ్యక్తిత్వం"** పేరిట ఆయన బాల్యం, విద్యా విశేషాలు, ఉద్యమాల్లో విద్యార్థిగా సిధారెడ్డి పాత్ర, కవిగా అంచెలంచెలుగా ఆయన ఎదిగిన తీరు ప్రస్తావిస్తు రాసిన వ్యాసంలో సిధారెడ్డి విశిష్ట వ్యక్తిత్వాన్ని తెలుసుకోవచ్చు. సంపూర్ణ మద్యపాన, గుట్కా వ్యతిరేక ఉద్యమాలు, తెలంగాణ అస్తిత్వ ఉద్యమం, దళిత ఉద్యమం, యిలా అనేక ప్రజా సంబంధిత,ఉద్యమాల్లో సిధారెడ్డి పోషించిన చురుకైన పాత్రను సవివరంగా రాస్తు డా॥తూర్పు మల్లారెడ్డి వెలువరించిన వ్యాసంలో **"మొత్తంగా సిధారెడ్డి స్వభావతః ఉద్యమకారుడు "** అని తెలియజేశారు.

**"తడి– వేడి–ఇవి రెండూ కలిస్తే సిధారెడ్డి కవిత"** అంటారు పాపినేని శివశంకర్ తన వ్యాసంలో.

జి. చెన్నకేశవరెడ్డి, సిధారెడ్డి తొలి కవితా సంపుటి **"భూమి స్వప్నం"** లోని వస్తు శిల్పాలు విశ్లేషిస్తె నాళేశ్వరం శంకరం సిధారెడ్డి కవితా సంపుటి **'సంభాషణ'**ను కవితా ఖడ్గధారగా వర్ణిస్తు వ్యాసాలను అందజేశారు. సిధారెడ్డి మరో కవితా సంపుటి **"ప్రాణహిత"**ను పరామర్శిస్తు **"ప్రాణహిత ఒకనది పేరు. ప్రాణాలకు హితవు జెప్పడానికే కవిత్వం అని ఒక అర్థం. కవిత్వంలో నదిలా ప్రవహించే గుణం, పండించే గుణం వుండాలని మరొక అర్థం. మనిషి కోసం, మనిషి ప్రాణం కోసం హితవు చెప్పిన 'ప్రాణహిత' సంపుటం.. అచ్చంగా ప్రాణహితం"** గా శ్లాఘిస్తారు గంగ్ర లక్ష్మణరావు.

**"సంఘర్షణ, సంసిద్ధత, సంయో గిత, స్పష్టత, సంభావ్యత"** సిధారెడ్డి కవితలకు పంచ ప్రాణాలుగా తోస్తాయంటారు డా॥ మట్టా సంపత్కుమారారెడ్డి.

**'నది పుట్టువడి'**, సిధారెడ్డిని తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వ కవులలో అగ్రగామిగా నిలబెడ్తుందని అభిప్రాయపడ్డారు కొప్పర్తి వెంకట రమణమూర్తి.

డా॥ ఏనుగు నరసింహారెడ్డి **'ఇక్కడి చెట్లగాలి'** గ్రంథాన్ని సమీక్షిస్తు సంక్షిప్తత, సూటిదనం, భాషా సారళ్యం, తాత్త్వికత సిధారెడ్డి కవిత్వ లక్షణాలనీ, అద్భుతమైన వస్తు శిల్ప సమన్వయం ఆయన స్వంతమనీ అంటారు.

కాత్యాయనీ విద్మహే **'నాగేటి చాల్లల్ల'** గురించి నాలుగు ముచ్చట్లు చెప్తూ సిధారెడ్డికి చాలా యిష్టమైనవి పువ్వులు, పాటలు.. అందుకే ఆ రెండింటి ప్రస్తావన లేకుండా ఏ ఒక్క పాట ఈ సంపుటిలో లేదని తేల్చేస్తారు. నిజమే! జీవితం పువ్వులాం టిదని సిధారెడ్డి భావం. దానిని ఛిద్రం చేసే ముళ్ళ గురించే ఆయన ఆవేదన!

దాస్యం సేనాధిపతి సిధారెడ్డి కవిత్వంపై ఓ విహంగ వీక్షణం గావిస్తే, ఆయన కవిత్వంలోని వస్తురూప వైవిధ్యాన్ని ఎత్తి చూపారు డా॥ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి.

**"సిధారెడ్డి ప్రతి అంగుళం కవి
చెప్పేదేదైనా
కవిత్వం గుప్పించే చేయి
అతనిది.."** యిదీ సిధారెడ్డిపై మహాకవి సినారె అభిప్రాయం అంటారు రాచపాళెంవారు.

ముదిగంటి సుజాతారెడ్డి సిధారెడ్డి కవిత్వంలో స్త్రీల చిత్రణ వర్ణిస్తే.. కోయి కోటేశ్వరరావు ఆయన కవిత్వంలోని శ్రమైక జీవన చైతన్యాన్ని వెలికితీస్తారు.

బాణాల భుజంగరెడ్డి సిధారెడ్డి కవిత్వంలో తెలంగాణ భాషా పరిమళాలు వెదజల్లిన తీరును ప్రస్తావిస్తే, ఆయన కవిత్వంలో తెలంగాణ వాదానికి పట్టం గట్టిన వైనాన్ని వెల్దండి శ్రీధర్ వెలుగులోకి తెచ్చారు.

సిధారెడ్డి కవిత్వంలోని వాస్తవికతను ఎం. నారాయణ శర్మ వెల్లడిస్తే, తండు కృష్ణ కౌండిన్య ఆయన కవితా హృదయాన్ని కదు హృద్యంగా ఆవిష్కరించారు.

కాట్రగడ్డ దయానంద్, సిధారెడ్డి కథలను సంక్షిప్తంగా సమీక్షిస్తే ఆయన వ్యాసాల ప్రాశశ్యతను బుక్కా బాలస్వామి, సామ మల్లారెడ్డిగారలు వివరించారు.

సిధారెడ్డి సిద్ధాంత గ్రంథం **"ఆధునిక తెలుగు కవిత్వం– వాస్తవికత, అధివాస్తవికత"** ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి 1986 సం॥లో పిహెచ్‌డి పట్టా అందుకున్న ఈ గ్రంథ విశ్లేషణను గుమ్మన్నగారి బాల శ్రీనివాసమూర్తి అందించారు. **దాదాపు 400 పుటల ఉద్గ్రంథం 'శిఖరం'..నందిని సిధారెడ్డి విరాట్ రూపాన్ని** సాక్షాత్కరింప జేస్తుంది. ఆయన కవిత్వం, జీవన ప్రస్థానంలోని విశేషాలను విశదీ కరించిన వ్యాసాలను సేకరించి గ్రంథరూపంలో అందించిన సంపాదకులు డా॥ గంటా జలంధర్ రెడ్డి అభినందనీయుడు. సాహితీ ప్రియులకు..మరీ ముఖ్యంగా సిధారెడ్డి అభిమానులకు **'తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి'** అందించిన అపురూప కానుక యిది.

ప్రతులకు:
డా॥ గంటా జలంధర్ రెడ్డిఇ.నెం. 9–70ఎ, ఫ్లాట్ నెం.70ఎ,
ప్రజయ్ గుల్‌మోహర్ గేటెడ్ కమ్యూనిటీ, కుంట్లూర్ రోడ్,
పెద్ద అంబర్‌పేట్
రంగారెడ్డి జిల్లా–501 505.



– రమణ వెలమకన్ని
సెల్: 9866015040

## అంతిమంగా మనిషే విజేత

మంచు వర్షంలో కురుస్తుంది
ఉదయాన్నే ఓ తెల్లని అంధకారం
మనుషులు దాటవేస్తున్నదంతా
వృథగా మారుతూ...
ఏమి లేదు? ఏమి ఉంది?
అనే తర్కం తరిగింది.
జీవితం ఓ అందమైన పూదోట
రోజూ కొత్త ఆలోచనలు
పూస్తూనే ఉంటాయి
కొన్ని రాలిపోతూనే ఉంటాయి
ఏది అణిచివేయబడుతుందో
అది లోలోపల
బుగులుతూనే ఉంది.
బొగ్గు గనులు ఎలా ఏర్పడ్డాయి?
ఆంతరంగికమైన అగ్గి
పొగలు జిమ్ముతుంది
నిజమే!

దృశ్యం ఒక సౌందర్యమే కాదు,
దృశ్యం ఒక గుహ కూడా.
దానిది వ్యక్తావ్యక్త భ్రమణం
స్వీయ అంతర్మథనానికి అది దూరం
ఆత్మ స్తుతిమయం
ఏకీకృత శైథిల్యం
ఆత్మహసన సదృశ్యం
నుతి స్తుతికి బలిదానం
దృశ్యా దృశ్య నిగమనం
గమన శూన్య విరాగం
ఇది సుందర నిష్యందల వధ్యశిల
ఏదేమైనా ఒక ఆభాస
అభివ్యక్తి చేయలేనిదేదీ
సౌందర్యం కాదు
అర్ధ సత్యాలన్నీ
ధర్మ సూత్రాలుగా పలకబడుతున్నాయి
గాయాల నుండి కారుతున్న
నెత్తురు అత్తరు కాదు కదా!

ఆ బోనులో నిలబడ్డ వాడు
నేరాన్ని కూడా
ఓ ఆదర్శమే అంటున్నాడు
ఊరు మందు వాసన వేస్తుంది
హాస్టల్లో పిల్లోడికి నోటికాడ
బువ్వ దగ్గరకు వచ్చేసరికి
సరుకులకు డబ్బు లేదు
వారి వినోదాలకు కోట్లు వెచ్చిస్తున్నారు
ముఖంలో వెలుగు లేని
వారిని కూడా
వెయ్యి దీపాలు వెలిగించి చూపిస్తున్నారు
జీవశ్చవాలకు ఊపిరి
పోయడమెందుకు?
విశ్వ పీఠాల మీద
ప్రకృతి పరిరక్షణ గురించిన బోధ!?
విమానం దిగేసరికి
అందులో మురిక్కాలవలై
ప్రవహిస్తున్న దృశ్యం!
అన్ని వేదాల్లోనే ఉన్నాయి!!
ఆ మూలవాసుల వధా ఘట్టాలు
మళ్ళీ పునరుద్దానమవుతున్నాయి

ఎవడో వేసిన రొట్టె ముక్క కోసం
కుక్కలు కొట్లాడుకుంటున్నాయి
తమది కాని దాని కోసం
ఆరాటపడే మనుషులు
ఏలికలుగా చలామణి అవుతున్నారు
వారిద్దరూ ఎంతో ఆకర్షణతో
ఒక్కటయ్యారు
మళ్లీ ఎంతో వికర్షణతో విడిపోయారు
కలిసి ఉండటం అంటే ఏమిటో
వీరికి అర్థమయిందా?
మతాంతరం అంటే ఏమిటి?
మనిషి ముఖ్యం కాదా?
స్త్రీ పురుషుల కలయిక
పుట్టుకకు కారణం కాదా?
ఈ మతం, కులం ఎక్కడిది?
ఒకనాడు వచ్చాయి
ఒకనాడు పోతాయి
ఆ గుహలో పులి
తన పిల్లల్ని తనే కొరికి చంపుతుంది
ఆ అడవి అంతా ఎండిపోయింది
అక్కడ తేనెతుట్టెలు కారిపోయాయి.

తేనెటీగలు ఎగిరిపోయాయి
సహజంగా పెరిగిన చెట్ల వేర్లు తుంచి
చిన్న చిన్న క్రోటన్లు పెంచుతున్నారు
ఆ సముద్రం మీద వస్తున్న ఓడల్లో
మత్తు మందులు
సరఫరా అవుతున్నాయి
నల్లధనం సరఫరాదారులే
నాయకులు!?
విధ్వంసం అవుతున్న ప్రకృతి
మానవ స్వభావం పై
ప్రశ్నల వర్షం కురిపిస్తుంది
వారు కదులుతూనే ఉన్నారు.
స్థిరం లేదు
వీరు స్తబ్దంగా ఉన్నారు
కదలిక లేదు
స్థిరానికి కదలికకు వైరుధ్యం
వారు నవ్వు రాకపోయినా నవ్వుతున్నారు
గుండెల్లో నిప్పులు
నవ్వడానికి మనుషుల్ని కొనుక్కుంటున్నారు
ఏడవడానికి మనుషుల్ని కొనుక్కుంటున్నారు
ఆమెకు దుఃఖం కలిగింది

అయినా నవ్వుతూనే ఉంది
ఆ నవ్వులో వివర్థత ఉంది
వారు గతంలో జీవిస్తున్నారు
గతం ఒక మగత
వారు అర్థ మనస్కులు
వాళ్ల కెమేరాలో కాళ్ళే కనిపిస్తున్నాయి
వారి సంగీతమంతా
బొటనవేళ్ళ మీదే
వేసుకుని విసిరేసే
పాత చెప్పులు మీదే.
ఆ దర్శకుడు ముఖవర్చస్సును
చూడటం మరిచిపోయాడు
అతడికి వారి కన్నుల్లో
వెలుగు చూడటం రాదు
ముఖాన్ని చూసే ధైర్యం
అతడికి లేదు
అతడు లోన జందెప్పోగు ధరించి
బయటకు నిద్రాణ వేదాంతం చెప్తాడు
వాడు కులం ఊబిలో
ఇరుక్కుపోయిన జంబూకుడు
వాడి అంతరంగంలో

మనుస్మృతి ఉంది
వర్ణధర్మం ఉంది
అశోకుడు తలలు తీసి తీసి
ఆలోచించాడు
కత్తి యుద్ధం కంటే
ధర్మ యుద్ధమే మంచిదని
లిఖిత ప్రతికంటే
శాసనాలే గొప్పవని
రాతి పలకల మీద
ధర్మాలు రాసి వెళ్ళాడు
అవి ఖండాంతరాల్లో
ప్రభాసిస్తాయి
నిజమే!
ఓడిపోతున్న వాడు గెలుస్తాడు.
గెలుస్తున్న ప్రతివాడు
ఓడిపోతాడు కూడా.
అన్నింటికంటే జీవించటమే గొప్ప.
జీవితంలో అన్నీ ఉంటాయి
అంతిమంగా మనిషే విజేత.



-డా. కత్తి పద్మారావు
9849741695

## ఆట ముగిసే సమయానికి

జీవితాన్ని హుందాగా
ఎంత ఎత్తైనా నిర్మించుకో.
సిరి సంపదలను, భోగభాగ్యాలను
ఎన్నైనా సమకూర్చుకో.
ఆత్మీయ బంధాల్ని
ఎందరితోనైనా పెంచుకో.

ప్రేమానురాగాల్ని
ఎంత గాఢంగానైనా పంచుకో.
ప్రస్తుతమున్న బంధాన్ని
చుట్టూ ఉన్న ప్రపంచంతో
ఎంత దృఢంగానైనా పెనవేసుకో.
వాటినన్నిటినీ
ఆట ముగిసే సమయానికి
సునాయాసంగా తెంచుకో.
ఎంత దట్టంగా ఉన్నా
గగన తలంలో విహరించే మేఘం
ఎప్పుడో హఠాత్తుగా కరగి
నేలపై రాలక తప్పనట్లు..
ఎంత ఎత్తున వేళ్లాడినా
తొడిమ ఎండిన పండు

ఎప్పుడో పుటుక్కున రాలినట్లు..
ఎన్నాళ్లున్నా
ఎంత గాఢంగా పెనవేసుకొన్నా
అద్దె ఇంటితో అనుబంధం
ఏనాటికైనా వీడక తప్పనట్లు..
ఎన్ని గంధాలతో పోషించినా
ఎప్పుడో ఒకప్పుడు
దేహం వీడి మనిషి
జీవన్ముక్తుడవ్వక తప్పదు.



– ఆచార్య కదారు వీరారెడ్డి
9392447007




## మనుషులు

గాలికి కదలాడే
కొమ్మల్ని రెమ్మల్ని అలా
చూస్తుంటే ...మనసు కళ్ళ ముందు....
సోలుదనమై సోమరిగాలికి సోలే
పూలపుంత సుంత
పులకరింత లేకున్నట్టు...
వెన్నెముక లేని మనుషుల్లా అట్టిట్టొతూ....

కాంక్ష ఏదో
కాంక్షి ఎవరో...
కుదురు లేని కుదురుల
చిక్కుబడే దారాల్లా
ఆశల ఆశాబంధాల
చిక్కి..
అబద్దాల ఆబందాల నక్కి
అయోమయమై..
అవిటితనమై..
కాలం కాళ్ళ కింద నత్తగుల్లల్లా..
మనుషులే....అసంబద్ధ అసత్యాల

సద్దుల
నిశిరాగంలా నీల్గుతూ...
మనుషులే.

పెద్దగానో..చిన్నగానో
పేరుండాలంటే
చాచని పాణి..
మెరవని సుపాణి..
కలవని కాలపు బాణి..
ఊసుల కొలవలేని
సమిహాల వాణి

అసలర్థం..ఆంతర్యం ఎరుగక
మధువు మాగాణాల
త్రిమ్మరులై...
మనుషులు.

సత్పథాన పయనించే
పక్షుల పరవశ
స్వనాలలో
పొన్నల సన్నాయి సరాలలో
నిజమైన నీలిరాగపు
పిలుపులో
గుండె చెమ్మలో
కోల్పోయిన కాలపు కౌగిలిలో
అన్వేషణలేని ఆక్రోశంలో..ఆవేదనలో
మనిషితనం లేని
మనుషులు..మనసులు
పుట్టలోని చెదలా
ఎరుపో తెలుపో నలుపో ...రంగుల
వాటులో..వేటలో..
వేటులో
పలుకులేని..
పిలుపులేని..
పొలయికలేని
పోరాటాల్లో
ఆరాటాలలో
అనురాగం మరచి...
మనుషులు.

పక్కవాడు ఎదుగుతుంటే...
ప్రత్యణువున పొంగి పొరలే
ఈర్ష్యాసూయల
నిలయమై
కొండను చూసి మొరిగే
కుక్కలౌతూ ..
మనుషులు.

అహం బ్రహ్మాస్మి అనుకుంటూ
అంతా తమకే తెలుసనుకుంటూ
లోకాధిపతి..
లోకనియంత తామే అనుకుంటూ
అందరి ఆత్మలు..
అక్షరాలు తమ చూపు
అధీనంలోనే ఉండాలనుకుంటూ..
దారులన్నీ తమవే అనుకుంటూ..
దాటలేని మచ్చరాన ..
మనుషులు.
మధువునిచ్చే తేనెటీగలు గాక
బాధించే కందిరీగలై...
మనుషులు.
ఎవరి బతుకు వారు బతుకుతున్నా
ఆబోతుల్లా అవతలి వారిని నేర్చిన
అక్షరాలన్నీ పేర్చి అసహ్యకరమైన
అభ్యంతరకరమైన
పదాలుగా కూర్చి
సభ్యత సఖ్యత మరచి
కుమ్మే...మనుషులు.
ఎదటి వారి స్వేచ్ఛా
సామ్రాజ్యాన తమ జెండా
ఎగురేయాలని చూస్తూ...
సుస్వన అక్షర గళాలకు
తామే అర్గళాలు అవాలని...
వేయాలని చూస్తూ...
విలువలేని కుత్సిత
దంష్ట్రల ఔన్నత్య వర్ణాలను గుచ్చే...
మనుషులు.



– రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి
సెల్: 9866583907



## నన్ను చిగురించనివ్వు

నేను ఈ భూమి ఆకాశం మధ్య
ఒక అందమైన అద్భుతలోకం నేను
అది నీకు తెలిసినా ఎందుకు ?
తెలియనట్టు ప్రవర్తిస్తున్నవో
నాకు తెలియట్లేదు...?

నేను ఈ భూమికి
పచ్చని సింధుర తిలకాన్ని
ప్రకృతి రమణీయతకు
శోభను కూర్చే కళారూపాన్ని
భూతల్లి గర్భం నుంచి
చిరు ప్రాణం పోసుకొని
ఈ లోకంలోకి వచ్చిన
ఒక తరువుని నీకొక ఆధారాన్ని!!

నేను సూర్యునితో పోరాడి
నీకు చల్లని నీడనిస్తున్నా
నేను వాయువుతో పోరాడి
నీకు ప్రాణ వాయువునిస్తున్నా
నేను మేఘంతో కలిసి
నీకు వర్షాన్నిస్తున్నా
నీకు తోడుగా తోబుట్టువుగా
నీతో ఉంటున్నాను కదా!!

నీ అవసరాలకు
నీ సుఖాలకు
లేలేత చిగురుకొమ్మలని
కొమ్మచాటున రెమ్మలని
నా శరీరం లాంటి మొదులని
మొదులకు ప్రాణమైన వేర్లని
తల్లి నుంచి బిడ్డను
వేరు చేసినట్టు
ఈ భూమి నుంచి నన్ను
వేరుచేస్తున్నారు న్యాయమా?

నీ నుంచి నన్ను నేను
రక్షించు కొంటూ
నిన్ను రక్షిస్తూ
ఆ సంగతి మరిచి
నన్ను నువ్వు బ్రతికుండగానే
చిన్న మొక్క నుంచి
మహా వృక్షాన్ని సైతం
నీ అహంకార మత్తులో
నన్ను హతమరుస్తుంటే
నేనట్టా బ్రతకాలి
నిన్ను ఎట్టా బ్రతికించాలి
నన్ను బ్రతకనివ్వు
నా ఆశలు చిగురించనివ్వు
ఓ మహా వృక్షమై
నిన్ను ఈ సమస్తాన్ని
నా కౌగిలి చేర్చుకొని
కంటి పాపల కాపుకాస్తా
నేనే కదా నీ ఆయువుని
అడుగడుగున నీ అవసరాలు
తీర్చే అమ్మలాంటి దాన్ని
నన్ను కాస్తా "చిగురించనివ్వు"

-లక్ష్మీ శ్రీనివాస్
9676601192

## మరణం లేని ఆయుధం

'అమ్మ' అనే పిలుపు జీవితానికి ఉనికిని ఇస్తుంది
'అ' కారంతో మొదలయ్యే అక్షరమాల బ్రతుకును ఇస్తుంది
భాష ఏదైనా మరణం లేని ఆయుధం అక్షరమే
వేలవేల సూర్యకిరణాల కాంతులను నిక్షిప్తం చేసుకుని
విశ్వమానవాళికి వెలుగులు పంచే జ్యోతి అక్షరమే
కూడబెట్టిన ఆస్తిని కుడుచువారు కొల్లగొట్టుకు పోవచ్చు
దాయాది మచ్చరాలు కాయాన్ని కడతేర్చనూ వచ్చు
కడుపులోని అక్షర లక్షల కబళించ సాధ్యమెవరికి?
విద్య ఇచ్చు వినయమును దోచు దొంగలెచటగలరు?
అమ్మ ప్రేమను పాశము వేసి లాగగల యమభటులు లేరు
అక్షరానికి మరణాన్ని కలిగించు మందులు భువిని లేవు
కత్తి కన్న పదునైన ఆయుధము కలమన్నది కాదనలేని సత్యం
పంచుకొలది పెరుగు ధాన్యమే అక్షరపు పంట
ధర్మము తప్పక మనుజుడు కూడబెట్టగల ధనమే అక్షరము
క్షరములేని మధురామృత భాండమే అక్షరము
అక్షరసుధలను పంచు,
అవనిన నిరక్ష్యరాస్యతను వధించు.



-శింగరాజు శ్రీనివాసరావు
9052048706

## బాధ్యత సల్లగుండ

బాధ్యత అంటే భారము కాదు
ఆధారము అది నీ ప్రతిభకు
బాధ్యత
నీ సమర్థతకు అద్దం పట్టు!
బాధ్యత
రెక్కలు లేని రాకెట్ పరుగు!
బాధ్యత
లోన దాగిన శాటిలైట్ వంటిది!
వయసు పెరిగిన కొలది
ఎత్తుకు ఎదిగిన కొద్దీ
బాల్య కవచాలు ఊడి
బాధ్యతల
భుజ కిరీటాలు మొలుస్తాయి!
శాటిలైట్ స్థిర కక్షలో తిరుగునట్లు
మనిషి బాధ్యతల వలయంలో
నిరంతరం పరిభ్రమిస్తున్నాడు!
కక్షలేని ఆకాంక్షల లోకంలో
తరం తరం పరిశ్రమిస్తున్నాడు!
బాధ్యత
బ్రతుకు తెరువుకు పురికొల్పి
ప్రజాజీవనాన్ని సుఖవంతం చేస్తుంది
ఎట్లావచ్చి పడుతుందో
బాధ్యత సల్లగుండ!



-పి.బక్కారెడ్డి
9705315250

## కంటి ముందర...

యెద్దును లేపి
ఏరును పూసి
ఏటి ఒడ్డున
బాడవ దున్ని
ఎదురుగ పూసిన
పొద్దును చూసి
ముద్దులాడి నావా
వెలుగు నీళ్లతో
తాన్నమాడినావా
....
మీదకి చూసావా
నీటి కోసం
కళ్ళజోడు ను
నింగికి తొడిగావా
కిందకి చూసావా
రెక్కల తాళ్ళతో
ఏతామేసి
పాతాలాన్ని
పలకరించి నావా
నీటిని తోడి
సిలకరించినావా
.....
పస్తులు పడ్డావా
పస్తులు అమ్మావా
విత్తులు కొన్నావా
బగ్గిల జల్లావా
ఆకుపచ్చని ఆకాశాన
మొక్కల సుక్కలు సూసి
మురిసి పోయినావా
పురుగు మందలు
పుట్లుకొలదిగా
పంటను తిన్నాయా
పున్నెం మూట
కట్టుకు పోయాయా
.....
అప్పులు తోడావా
పట్నం పోయావా
పెస్తిసైడ్లు కొన్నవా
పురుగులు సావక
అప్పులు తీరక
పులుసుబువ్వలో
పురుగు మందును
కలిపావా
కంటి ముందల
గుంటలు కనబడి
కన్నీటిని తాగాగావా
......
పట్టవు కొడుకా
ఏలినవారికి
నీ కష్టబాధలెపుడు
పండిన పంటకు
గిట్టుబాటు ధర
బొడికొండపై
వాన కురిసి నట్టు
ఎన్నిక లోస్తే
రైతువు కాదు
రాజై పోతావు
ఓటును వొదిలి
వొట్టిపోయిన
గోవే అవుతావు
......
ఎగరడానికి
రెక్కలురావు
రలినచోటే
మొలవాలంతవు
పోయిన చోటే
వెతకాలంటవు
సూర్య చంద్రులను
గిలకలు చేసి
ఆడిస్తు వుంటావు
చెమట నీళ్లతో
ఆకలి మంటలు
ఆర్పుతు వుంటావు.



-చింతా అప్పలనాయుడు
9441713185

## సరైన బాట

ఉషోదయం
వేళ తప్పకుండానే
యువతరం మాత్రం
నిద్రలోనే
వ్యాపకం లేని మనసు
తాబేలు చందం
నిబద్ధత లేని జీవితం
కళ్ళెం లేని గుర్రంలా
కట్టడి నచ్చని వయసు
సంకెళ్ళు లేని పరుగు
రెండూ ప్రమాదమే
లక్ష్యం వైపు చూపు
గమ్యం దిశగా నడక
శ్రమ ఆసరాగా పయనం
విజయానికదే కదా
అసలైన బాట

-యలమర్తి అనూరాధ
9247260206

## సాగిపో..!

కాలంతో పాటు పోటీ పడి సాగిపోవడమే కదా జీవితం..
ఎన్ని ఆటుపోట్లు ఉన్నా ఆగకుండా సాగడమే కదా జీవితం..
తీరం దాటి వెళ్లలేమని తెలిసి కూడా అలలు ఎగసిపడకుండా ఆగిపోతున్నాయా..
కష్టాలు ఎన్నో చుట్టుముట్టాయని మన జీవితాన్ని ఆపేసుకుంటామా..
చుక్కనీరైనా తాను తాగలేనని తెలిసి కూడా మేఘం వర్షించడం మానేస్తోందా..
కాసే ప్రతీ కాయా తాను తినలేనని తెలిసి వృక్షం ఫలాలు అందించడం మానేస్తుందా..
అందుకే ఓ మనిషీ నీవు చేసే పనులు నీకు ఉపయోగపడడం లేదని వెనకడుగు వేయకు
నీ వల్ల ఒక్కరైనా సంతోషిస్తే నీ జన్మ ధన్యం కాదా...
అందుకే ఓ మనిషీ..!! సాగిపో ఒక్కో అడుగు ముందుకు వేస్తూ
ఆగిపోకు ఎక్కడా .. కాలంతో పాటు సాగిపో..



-దేవలపల్లి సునంద
9291599562

## నాడు నేడు

గుడులు గోపురాలు కట్టి
తరించారు ఆనాడు-
గుడులను
గుడి ఆస్తి పాస్తులను అమ్ముకొని
పెరుగుతున్నారు ఈనాడు-
ప్రకృతిని దైవంగా భావించి
బ్రతికారు ఆనాడు-
ప్రకృతి సంపదలను పాడుచేస్తు
బ్రతుకుతున్నారు ఈనాడు-
ప్రజలు కష్టసుఖాలను
తెలుసుకొనుటకు
మారువేశాలు కట్టి తిరిగారు ఆనాడు-
ప్రజలను మభ్యపెట్టి
పదవులను చేపట్టడానికి
కండువాలు మార్చుతున్నారు ఈనాడు-

మాటకొరకు పాటుపడ్డారు ఆనాడు
నోటు కొరకు పాడుపడుతున్నారు ఈనాడు

ఉన్నమాటంటే ఊరేగించారు ఆనాడు
ఉన్నమాటంటే ఉరికంబం
ఎక్కిస్తారు ఈనాడు.



- సిరిగాద శంకర్
సెల్:9493301985

## తొలిముద్దకు తోడుగా..!!

పులకించదా మేను
కంచంలో పచ్చడి చేరితే..!!

తొలి ముద్దలో జిహ్వను
ఆత్మీయంగా పలకరిస్తే..!!

పంచభక్ష్యాలూ పక్కకే...
అన్నానికి పక్కన పచ్చళ్ళుంటే..!!

కాలానికి తగ్గట్టుగా
కొత్తకొత్త అవతారాలెత్తే పచ్చళ్ళు..!!

ఎల్లప్పుడూ సంసిద్ధమే..
అనుకోని అతిథులు ఎప్పుడొచ్చినా !!

రుచుల రాజ్యాలను ఏలే
మహారాణులు పచ్చళ్ళు..!!

ఆత్మబంధువులే భోజన ప్రియులకు..
ఎప్పుడూ..ఎల్లప్పుడూ..!!



-పేరిశెట్టి బాబు
9247170800

## చిలుక - కోకిల

ఊరిలోన గట్టుంది
గట్టుపైన చెట్టుంది
చెట్టుపైన చిలుకమ్మ
జామకాయ తింటుంది.

చిలుక ముక్కు ఎర్రన
చిలుక రంగు పచ్చన
జ్యోతిష్యం చెప్పేటి
చిలుక పలుకు తియ్యన

కోకిలెంతో నల్లనుండు
రాగమెంతో తియ్యనుండు
చక్కని రూపంతో
వేగంగా ఎగురుతుండు.

కూకూ అని కూసెను
వసంతమే వచ్చెను
కోకిల రాగంతో
ఋతువులన్ని మారెను

-మిట్ట అంజి,
10 వ తరగతి
జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల,
నర్సింహుల పల్లి
పెద్దపల్లి జిల్లా.

## తనకు మాలిన ధర్మం (కథ)

“అగర్వాల్ గారికి కూడా పాజిటివ్ వచ్చిందట. ఇప్పుడు ఆస్పత్రిలో వెంటిలేటర్ పై ఉన్నారట” జోసెఫ్ వార్త చెప్పాడు.

“మొన్న ఆదివారం నాడు మనతో పాటు ఉన్నాడుగా? అప్పుడే ఏమైంది?” రసూల్ భాయ్ లో ఆందోళన.

“సోమవారం, వారి పక్క ఫ్లాట్ లోని అరోరా గారికి కరోనా సూచనలు కనపడగా, వారింట్లో మగవారెవరూ లేనందున, వారిని తీసుకొని కార్పొరేట్ ఆస్పత్రికి అగర్వాల్ గారే తన కార్లో తీసుకెళ్లారట. అక్కడ అరోరాగారికి పాజిటివ్ అని తేలగానే అక్కడే అడ్మిట్ చేసి తిరిగొచ్చారట. మంగళవారం, అగర్వాల్ గారికి దగ్గు, జ్వరం, శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది మొదలయ్యాయట. వెంటనే వారి అబ్బాయి అగర్వాల్ గారిని అదే కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్చాడట. అప్పుడు ఆయనకి కరోన సోకిందని నిర్ధారించారట. శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది కొనసాగడంతో వెంటిలేటర్ పై పెట్టారట. పరిస్థితి కాస్త సీరియస్ గానే ఉందట” అగర్వాల్ గారి పొరుగింటి రుద్రరాజు గారు చెప్పారు.

“మంచి చేయబోతే చెడు ఎదురైందన్న మాట.” జోసెఫ్ తన అభిప్రాయం వెలిబుచ్చాడు.

“అందుకే అంటారు, ‘తనకు మాలిన ధర్మం మొదలు చెడ్డ బేరం కలదా?’ అని” గిరి ప్రసాద్ కుండ బద్దలు కొట్టాడు.

అవధాని, అగర్వాల్, అరోరా, రుద్రరాజు, జోసెఫ్, రసూల్ భాయ్, నగర శివార్లలో ఉన్న కాలనీ నివాసులు. అంతా అరవై సంవత్సరాలు పైబడి ఉద్యోగాల నుంచి రిటైరైన వారే. కరోనా లాక్ డౌన్ కాలంలో ఇంటి దిగ్బంధం లో ఉన్నవారే. అన్ లాక్ డౌన్ ప్రక్రియ మొదలై ఓ వారం రోజులు గడిచాక, ఇంటివారు ఎన్నో జాగ్రత్తలు చెప్పగా, ముక్కుకు, నోరుకు మాస్క్ వేసుకుని భౌతిక దూరం పాటిస్తూ, రెక్కలు తొడిగిన పక్షుల్లా, తమ కాలనీలోని పార్క్ సన్నిధి లోని చెట్లచెంత, వారంతా వాలిపోవడం మొదలు పెట్టారు.

అగర్వాల్, అరోరా ఆస్పత్రి పాలవగా తక్కిన నలుగురు స్వచ్ఛమైన గాలి పీల్చడానికి పార్క్ లో కొలువుదీరారు. తనకు మాలిన ధర్మం అనే మాట వినగానే రుద్రరాజు, తనకూ అలాంటి అనుభవం ఎదురైందన్నాడు. “ఏంటది? చెప్పు, చెప్పు” అని అందరూ కోరస్ పాడారు.

“ఇది జరిగి దాదాపు పది సంవత్సరాలు కావస్తోంది. మా అమ్మగారు ‘నాకు కాశీ చూడాలని ఉంది రుద్రా’ అని ఎన్నో ఏళ్లు ప్రాధేయ పడింది. నా ఉద్యోగ బాధ్యతల వల్ల, సెలవుకు ఇబ్బందిగా ఉండడం వల్ల మా కాశీ ప్రయాణానికి వీలు కాలేదు. ఓ సారి మా అమ్మకు తీవ్ర జబ్బుచేసి ఆస్పత్రిలో చేర్చాల్సి వచ్చింది. వారం రోజులు ఆస్పత్రిలో ఉండి వచ్చాక ‘నేను ఇంకెన్ని రోజులు బతుకుతానో తెలియదు. ఇప్పుడన్నా నాకు కాశీ చూపించరా!’ అని దీనంగా అడిగింది. అప్పుడు నా కళ్లలో నీళ్లు తిరిగాయి. ఉద్యోగ బాధ్యతలకు అంతు ఉండదు. మా అమ్మ కోరిక ఎలాగైనా తీర్చాలనే ఉద్దేశ్యంతో మా అమ్మగారితో పాటు మా కుటుంబమంతా కాశీ యాత్ర చేయడానికి ప్లాన్ చేశాము. ఆ సంగతి తెలుసుకున్న మా పక్కింటి పెద్దమ్మ, తనని కూడా కాశీ తీసుకెళ్లమని మా అమ్మతో రాయబారం నడిపింది.

“ఆమె కొడుకు ముంబయిలో ఉంటాడు. ఈ పెద్దమ్మ అక్కడి ఇరుకింటిలో ఇమడలేక పోయింది. పైగా ఆ కోడలుకి అత్త పొడ గిట్టదు. అందుకే కాళ్లూ చేతులూ ఆడుతున్నాయి కాబట్టి, ఒక్కతే తమ ఇంటి ఓ భాగం అద్దెకిచ్చి, ఆ అద్దె డబ్బులతో రోజులు వెళ్లదీస్తోంది.

పెద్దావిడను మనతో పాటే తీసుకెళితే, ఆమెకు కాశీ విశ్వేశ్వరుని దర్శనభాగ్యం కలుగుతుంది, ఆమెకు ఆ అవకాశం కల్పించినందుకు, మనకూ అంతో ఇంతో పుణ్యం దక్కుతుంది.” శ్రీమతి సిఫారసు చేసింది. హోం మినిస్టర్ మాటకు ఎదురు చెప్పే దమ్ము లేకపోయింది. ‘సరే’ అన్నాను. రానూ పోనూ రైలు టిక్కట్లు తీసాను. కాశీలో మన తెలుగువారి సత్రంలో దిగి, అక్కడి పురోహితున్ని కుదుర్చుకున్నాం. అతను మాకు కాశీ విశ్వేశ్వరుడు, అన్నపూర్ణ, భైరవనాథ్ మొదలగు మందిరాల దర్శనం చేయించాడు.

ఆ తర్వాత గంగా తీరంలో మా పూర్వీకుల పిండదానానికి ఏర్పాటు చేశాడు. గంగా నదిలో స్నానాలు చేసి కొంత సేపు గంగా విహారం కూడా చేశాము. నదీ తీరంలోని మణికర్ణికా ఘాట్ లో కొన్ని శవాలు దహనం చేయడం చూశాము. ఆ తర్వాత సాయంత్రం గంగా హారతి కనుల పండుగలా తిలకించాము. ఆ హారతిచ్చే యువకులు మా తెలుగు వారని తెలిసి ఆనంద పడ్డాం. ఆ తర్వాత విడిదికి వచ్చాం. మర్నాడే మా తిరుగు ప్రయాణం. అప్పుడు వచ్చింది సమస్య.” రుద్రరాజు మంచి నీళ్ల బాటిల్ నుండి నీళ్లు తాగాడు.

“ ఆ తర్వాత? అసలు వచ్చిన సమస్యేమిటి? ” జోసెఫ్ లో కుతూహలం.

“ చెబుతా, చెబుతా నన్ను కాస్త ఊపిరి పీల్చుకోనియండి. మాతో వచ్చిన పెద్దమ్మకు ఆ రాత్రి గుండెపోటు వచ్చింది. మా పై ప్రాణాలు పైనే పోయాయి. మర్నాడు ప్రయాణం అనుకుంటే ఇవేం తిప్పలురా నాయనా! అనుకున్నాను. ఆ సత్రం వారి సహాయంతో పెద్దమ్మను అక్కడి ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చాము. వారు డిపాజిట్ కట్టమంటే నా క్రెడిట్ కార్డ్ తో కట్టాను. ఇరవై నాలుగు గంటలు గడిస్తేనే కాని, ఏమీ చెప్పలేమన్నారు. పెద్దమ్మ ఐ.సీ.యూ. లో ఉంటే, నేనూ, శ్రీమతి బయట జాగారం చేశాము. మర్నాడు ఉదయమే మా అబ్బాయిని రైల్ టిక్కట్లు రద్దు చేయడానికి పంపించాను. ఆ రోజు సాయంత్రానికి టెస్ట్ రిపోర్ట్ లు వచ్చాయి. గుండెలో కొన్ని బ్లాకులు ఉండడంతో రక్త ప్రసరణ సరిగా కావడం లేదన్నారు. స్టెంట్ లు వేయాలి కాబట్టి ఆపరేషన్ చేయడం తప్పదన్నారు. గాలికి పోయే కంపను ఒంటికి చుట్టుకున్నట్టయింది. ఆ పెద్దమ్మ కొడుకుతో మాట్లాడితే ‘ఆపరేషన్ అక్కడ వద్దు, మా ఆఫీస్ మెడిక్లెయిం సౌకర్యంతో ముంబయి లోనే చేయిస్తాను. వీరెగ్గైనా హైద్రాబాద్ తీసుకువస్తే, నేను ముంబయి తరలించి అక్కడే ఆపరేషన్ కి ఏర్పాటు చేస్తానన్నాడు.’ పెద్దమ్మ ఆరోగ్యం ప్రయాణానికి అనుగుణంగా లేకపోవడంతో, అమెను నాలుగైదు రోజులు ఆస్పత్రిలోనే ఉంచి చికిత్స చేయించాల్సి వచ్చింది.

జబ్బు మనిషితో రైలులో సుదీర్ఘ ప్రయాణం చేయలేకా, ఏసీలో కూడా రైలు టిక్కట్ల రిజర్వేషన్ దొరుకక, విమానంలో తిరుగు ప్రయాణం చేయాల్సి వచ్చింది. నా సెలవు ఇంకో వారం పొడిగించాను. కాశీలో పొడిగించిన మా బసకూ, విమాన టిక్కట్లకూ నా బడ్జెట్ లో యాభై వేల రూపాయల బొక్క పడింది. పెద్దమ్మ చికిత్సకు ఖర్చు పెట్టిన మొత్తం ఆమె సుపుత్రుడి నుండి రాబట్టడానికి ఏడు చెరువుల నీళ్లు తాగాల్సి వచ్చింది. ‘అసలు నన్ను సంప్రదించకుండా అంత

> “మనం మన శాయశక్తులా తోటి వారికి సహాయ పడదాం. ఒక్కోసారి మనకు మనఃస్థాపంకలిగినా ఓర్చుకుందాం. మనలోని మంచిని పెంపొందిద్దాం. ఈ జీవన సంధ్యలో సమాజానికి చేతనైన సహాయం చేద్దాం.”

ఖరీదైన ఆస్పత్రిలో ఎందుకు చేర్చారు?’ అని పేచీ పెట్టాడు. అప్పటి నుండి ‘తనకు మాలిన ధర్మం చేయకూడదని చెవులు పట్టుకున్నాను” రుద్రరాజు తన సుదీర్ఘ ఏకరువు ముగించాడు.

“మానవత్వంతో నువు ఆమెకు చేసిన మేలు ఎన్నటికీ వృథా పోదు. ఆ దేవుడు నిన్ను తప్పక కరుణిస్తాడు” జోసెఫ్ ఉవాచ.

“అలాంటి అనుభవం నాకూ ఎదురైంది. కాకపోతే అది, అంత ఖర్చుతో కూడుకున్నది కాదు.” రసూల్ భాయ్ అన్నాడు.

“ నువ్వూ కానీయ్ రసూల్ భయ్యా!” గిరి ప్రసాద్ లో ఉత్సుకత.

“అవి నేను ముంబయిలో పని చేస్తున్నప్పటి రోజులు. నా జీతానికీ అక్కడి ఖర్చులకీ పొంతన కుదరక, కుటుంబాన్ని హైద్రాబాద్ లోనే ఉంచి నేనక్కడ బ్యాచిలర్ జీవితం ఆస్వాదించే వాణ్ణి. రెండు మూన్నెళ్ల కొకసారి, సెలవులు, శని, ఆదివారాలు కలిసి వచ్చినపుడు, హైద్రాబాద్ వచ్చే వాణ్ణి. అలా ఓ సారి హుసేన్ సాగర్ ఎక్స్ ప్రెస్ లో హైద్రాబాద్ బయలుదేరాను. నాకు ఎస్. మూడులో బర్త్ రిజర్వ్ అయింది. నా బర్త్ లో ఓ పెద్దావిడ కూచొనుంది.

అది నా బర్త్ అని చెప్పడం తో ఓ యువకుడు ‘సర్! మా అమ్మ గారికీ నాకు టిక్కట్లు తీసినప్పుడు వెయిటింగ్ లిస్ట్ లో ఉన్నాయి.

ఇప్పుడు కన్ఫర్మ్ అయ్యాయి కాని మా అమ్మకు ఇక్కడ, నాకు ఎస్. పదకొండులో బర్త్ లు దొరికాయి.

మీకు అభ్యంతరం లేకపోతే ఎస్ పదకొండు లోని నా బర్త్ తీసుకోండి. అప్పుడు మా అమ్మతో నేను ఉండవచ్చు. ఆమె ఆరోగ్యం అంతంత మాత్రంగా ఉంది. నేను తనతో ఉండడం తప్పనిసరి. మీరొక్కరే కాబట్టి, దయచేసి అక్కడికి మారండి’ అని విన్నపం చేశాడు.

ఒక సాటి ప్రయాణీకుడిగా ఆ మాత్రం సర్దుకుంటే పోయేదేముంది? అనుకుని నేను ‘సరే’ నన్నాను. అదే నా ప్రాణం మీది కొచ్చింది.

ఛత్రపతి శివాజి టర్మినస్ నుండి బయలుదేరిన హుసేన్ సాగర్ ఎక్స్ ప్రెస్, దాదర్, ఠాణే లో ఆగకుండా, నేరుగా కళ్యాణ్ లోనే ఆగుతుంది. కోచ్ లోపల జనాలు నిండా ఉండడంతో నా సూట్ కేస్, చంక బ్యాగ్ పట్టుకుని ప్లాట్ ఫాం పై దిగాను. అప్పుడుగాని తెలియలేదు, నేనెంతటి సాహసానికి ఒడిగట్టానో. స్టేషన్ నిండా జనం, వారి సామాన్లూ, పిల్లా పాపలతో పరుగెడుతున్నారు.

పద్మవ్యూహం కంటే జటిలంగా ఉన్న ఆ జన సమూహాన్ని నా బరువైన లగేజితో పాటు ఛేదించడం చాలా కష్టమైంది. రైలు కదిలే లోగా ఎస్ పదకొండుకి చేరడం అసంభవమనిపించింది. ఐనా ఎలాగో ముందుకు సాగాను. అంతలో రైలు కదలడానికి సిద్ధంగా ఉన్న సూచనగా విజిల్ వినపడింది. వెంటనే నాకు దగ్గర్లో ఉన్న కోచ్ లో దూరాను. రైలు కదిలింది. తీరా చూస్తే అది ఎస్. ఆరు కోచ్. అంటే కోచ్ లోపలినుంచే, ఇంకా ఐదు కంపార్ట్ మెంట్లు దాటాలి. రైలు తప్పి పోతుందేమో అన్న టెన్షన్ ఒకపక్కా, లగేజి మోయడంతో నీరసం ఇంకో పక్కా నన్ను ఉక్కిరి బిక్కిరి చేశాయి. ఓ ఐదు నిమిషాలు నుంచుని సేద తీరాను. ఆ తర్వాత నా సామాను మోస్తూ, జనాల్లోంచి సందు చేసుకొని ముందుకు సాగాను. నా సామాను తమకు తగిలిందనే వారి తిట్లు తింటూ అవి నన్ను కాదని అనుకుంటూ, ఎలాగోలా ఎస్. పదకొండు కోచ్ లో నా బర్త్ దగ్గరికి చేరుకున్నాను. అదృష్టవశాత్తు టీ.సీ. అక్కడే ఉన్నాడు. ఆ బర్తు శాల్తీ రాలేదని చూడడంతో అది ఆర్.ఏ.సీ. వారికి కేటాయించడానికి సిద్ధంగా ఉన్నాడు. నేను టిక్కట్టు చూపించేసరికి అది ఎస్. మూడు గదా అన్నాడు. నేను బర్త్ మార్చిడి సంగతి వివరించి అతన్ని ఒప్పించేసరికి తాతలు దిగి వచ్చారు.

ఆ కోచ్ టీ.సీ. వేరు, నేను వేరు. ఇలా మీలో మీరే బర్త్ లు మార్చుకుంటే మేము డ్యూటీ ఎలా చేసేది? అని మండి పడ్డాడు. చివరికి కొన్ని గాంధీ తాతలు చేతులో పడే సరికి శాంతించాడు. ఆ గంట సేపు నేను పడ్డ యాతన, శ్రమ గుర్తుకు వస్తే ఇప్పటికీ ఒళ్లు గగుర్పొడుస్తుంది. ఆ మనఃస్తాపం మాటల్లో వర్ణించ లేను. ఏదో మానవతా దృక్పథంతో ఒకరికి సాయం చేయాలనుకుంటే ప్రత్యక్ష నరకం కళ్ల జూడాల్సి వచ్చింది. అప్పటి నుంచి తనకు మాలిన ధర్మం చేయకూడదని నిశ్చయించాను.” రసూల్ భాయ్ తన కథనం ముగించాడు.

“మీరు చెబుతుంటే నాకూ అలాంటి ఘటన జ్ఞప్తికి వస్తోంది.” గిరిప్రసాద్, తన అనుభవం నెమరు వేసుకున్నాడు.

“మనం ఇళ్ళకు బయల్దేరడానికి ఇంకా బోలెడు సమయముంది. నువ్వూ కానీయ్” రుద్రరాజు ఉత్సహ పరిచాడు.

“ఎనిమిది సంవత్సరాల క్రితం నేనిక్కడ మా కంపెనీ, దాక్షిణాత్య రాష్ట్రాల జోన్ కు అధినేతగా ఉండేవాణ్ణి. ఉద్యోగ రీత్యా పలు చోట్లకు తనిఖీకి వెళ్లే పని ఉండేది. కంపెనీ కారు, డ్రైవర్ ను కూడా సమకూర్చింది.

ఓ రోజు నా మిత్రుడు, తన చెల్లి పెళ్ళి ఆహ్వాన పత్రిక తీసుకుని ఇంటికి వచ్చాడు. పెళ్లికి తప్పకుండా రావాలని చెబుతూనే ఇంకో విన్నపం చేశాడతను.

పెళ్ళికి వచ్చే బంధువుల రాకపోకలకు సౌకర్యంగా ఉండేందుకు గాను, రెండు రోజులపాటు నా కారు, డ్రైవర్ ను పంపమన్నాడు.

నేను తటపటాయించాను. వ్యక్తిగత అవసరాలకు కంపెనీ కారు వాడటం నాకు ఇష్టముండదు. అదే ఆ మిత్రునికి చెప్పాను. అంతలో మా శ్రీమతి జోక్యం చేసుకుంది.

‘ఆ రెండు రోజులు మీకు సెలవులే కదా? పాపం అన్నయ్య గారు నోరు తెరిచి అడిగారు. ఐన వారికి ఆ మాత్రం సాయపడకుంటే ఎలా? కారు, మన ఇంటి గ్యారేజీలో ఉండే బదులు వారి అక్కరకు పనికొస్తుంది. మీరు ఒప్పుకోండీ” అంటూ దిర్ఘాలు తీసింది.

అన్యమనస్కంగానే తల ఊపాను.

‘కార్లో పెట్రోల్ మేమే పోసుకుంటాం. తిరిగి ఇచ్చేటప్పుడు ట్యాంక్ నింపి అప్పజెప్పుతాం. డ్రైవర్ కి భోజన పానీయలతో పాటు బేటా కూడా ఇస్తాం.’ అన్నాడా స్నేహితుడు.

‘కారు సరే. కాని వ్యక్తిగత పనులకు కంపెనీ డ్రైవర్ ని వాడుకోవడం నాకు ఇష్టముండదు. మీరు వేరే డ్రైవర్ ను మాట్లాడుకుంటే మంచిది. కారుకి మాత్రం ఏ చిన్న దెబ్బ తగిలినా మా హెడ్ ఆఫీస్ తో మాట పడాల్సి వస్తుంది. జాగ్రత్త.’ నేను హెచ్చరించాను.

‘అలాగే. అలాగే’ అంటూ తెగ ఆనంద పడ్డాడతను.

పెళ్లికి మేము టాక్సీలో వెళ్లాల్సి వచ్చింది. ఐనా ఓర్చుకున్నాను. రెండు రోజుల తర్వాత, ఆఫీసుకు తీసుకెళ్ల డానికి మా డ్రైవర్ వచ్చాడు, కాని కారు పత్తా లేదు. ‘ఉదయం ఎనిమిదింటికల్లా కారు మీ ఇంట్లో ఉంటుందని’ చెప్పిన మిత్రుని ఫోన్ స్విచాఫ్! నాకు బి.పి. పెరిగిపోతోంది. కంపెనీ కారు ఎందుకిచ్చానా? అని పశ్చాత్తాపం మొదలైంది.

‘నువు చెప్పావని ఇచ్చానని’ శ్రీమతి పై విరుచుకు పడ్డాను. ఆమె మాత్రం ఏం చేస్తుంది? నా ఆతృత నాది. గడియారం పది గంటలు కొట్టింది. ఇక ఆగలేకపోయాను. నేనూ, డ్రైవర్, ఆటోలో ఆఫీసుకి బయలు దేరాం. దారి పొడుగునా ఆ మిత్రున్ని తిడుతూనే ఉన్నాను,

మనసులో. నన్ను నేను కూడా తిట్టుకున్నాను. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏం లాభం? చివరాఖరికి పగలు రెండు గంటలకి

ఆ మిత్రుని ఫోన్. నేను అతనిపై విరుచుకు పడ్డాను. అతను మాత్రం శాంతంగా ‘నేను చెప్పేది విను గిరీ! పెళ్ళి హడవుడిలో ఫోన్

చార్జింగ్ లో పెట్టడం మరిచి పోయాను. అందుకే అది నీకు స్విచ్ఛాఫ్ అని వచ్చింది. ఉదయం ఏడు గంటలకే మేము కుదుర్చుకున్న

డ్రైవర్ ను మీ కారుతో పాటు మీ ఇంటికి బయలు దేరాము. తొందరగా మీ ఇంటికి వచ్చి, మళ్ళీ తన డ్యూటికి వెళ్లాలనే హడావుడిలో

అతను కాస్త స్పీడ్ గానే బండి నడిపాడు. అంతలో ఓ ఆవు అడ్డమొచ్చింది. దాన్ని తప్పించడానికి స్టీరింగ్ తిప్పితే కారు పోయి డివైడర్

కి గుద్దుకుంది. ఇంకేముంది పోలీస్ కేసు, పంచనామా, ఆ తర్వాత డ్రైవర్ ను ఆస్పత్రి లో చేర్చి, కారు రిపేర్ కు ఇచ్చి, నీకు ఫోన్

చేసే సరికి ఇంత టైం పట్టింది. చాలా చాలా సారీ గిరీ! సారీ గిరీ! సారీ గిరీ!’ అని అతను పలు మార్లు తన విచారం వ్యక్తం చేశాడు.

అతను పదే పదే సారీ చెప్పినా, నా మీద ‘స్వారీ’ చేసిన మనఃస్తాపం ఏ మాత్రం తగ్గలేదు. మొదటి సారి నా సిద్ధాంతానికి విరుద్ధంగా

ప్రవర్తించినందుకు తగిన శాస్తే జరిగింది. దాదాపు వారం రోజుల తర్వాత, కారు మా ఇంట్లో వాలింది. దాంట్లో ఉన్న రెండు లీటర్ల

మోటర్ ఆయిల్, ఇంకా కొన్ని స్పేర్ పార్ట్ లు మాయమయ్యాయి. కారుకు పడ్డ సొట్టలు అదనం. ఏం చెప్పేది? ఎవర్ని నిందించేది?

మళ్లీ నన్ను నేనే తిట్టుకున్నాను. కారు ప్రమాదానికి గురైనందుకు మా హెడ్డాఫీసుకు సంజాయిషీ ఇవ్వాల్సి వచ్చింది. గుడ్డిలో మెల్లగా,

ఇన్స్యూరెన్స్ వాళ్లు ఇచ్చిన డబ్బుపోగా, కారు రిపేరుకి ఐన ఖర్చు, ఆ మిత్రుడే భరించాడు. ఐతే వారం రోజులు నా రాకపోకలకి ఐన

ఖర్చు నేనే నా నెత్తిన వేసుకున్నాను. అది కూడా నా మిత్రుడు ఇస్తానన్నాడు కాని నా అంతరాత్మ ఒప్పుకోలేదు.

అప్పటినుంచి, తనకు మాలిన ధర్మం కూడదని ఒట్టు పెట్టుకున్నాను.” గిరి ప్రసాద్ తన అనుభవాన్ని ముగించాడు. అంతా విన్న అవధాని గారు మొదలు పెట్టారు.

“మీ అందరి అనుభవాల వల్ల మీరు, మీకు మాలిన ధర్మం కూడదని అనుకోవడం సబబే. కాని లోకంలో మానవత్వం

అనేదొకటుంది. దాని ప్రభావంతో మనలో చాలా మంది, సాటి వారి కష్టాల్లో, వారిని ఆదుకోవాలనుకుంటారు. మీ లాంటి వారి అనుభ వాల వల్ల ఆ తర్వాత సహాయం చేయడానికి వెనకడతారు. అది సరి కాదు. మీకు ఎదురైన సంఘటనలు, మీ నుండి సహాయం పొందిన వారు కావాలని సృష్టించినవి కావు. దైవ సంకల్పంతో అవి అను కోకుండా జరిగినవి తప్పితే, ఎవరో మీకు నష్టం కలిగించాలనే ఉద్దేశ్యంతో చేసినవి కావు. మీకు జరిగిన నష్టం, కలిగిన మనస్తాపం, అన్నీ కాకతాళీయమే, తాత్కాలికమే, కాని మీ నుండి సహాయం పొందిన వారి మనసులో మాత్రం ఆ కృతజ్ఞతాభావం ఆజన్మాంతం ఉంటుంది. వారికి మీరు చేసిన ఉపకారం,

ఏదో రూపంలో మీకు తిరిగి చేరుతుంది. ‘అపకారికి ఉపకారం నెపమెల్లక చేయువాడు నేర్పరి’ అన్నాడు సుమతీ శతకాకారుడు. ఆ

మధ్య వాట్సాప్ లో ఓ ఉదంతం చదివాను. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అధినేత్రి శ్రీమతి సుధా మూర్తి గారు రైల్లో, దీన పరిస్థితిలో ఉన్న ఓ

బాలికను చేరదీసి ఆ అమ్మాయికి చదువు, వసతి కల్పిస్తారు. ఆ తర్వాత మరిచి పోతారు. కొన్ని సంవత్సరాల తర్వాత శ్రీమతి సుధా

మూర్తి గారు ఏదో సమావేశంలో పాల్గొనడానికి అమెరికా వెళతారు. అక్కడి ఆమె హోటల్ బిల్లు వేరెవరో చెల్లించారని తెలుస్తుంది.

ఎవరు చెల్లించారని ఆరా తీయగా ఓ యువతి తనే చెల్లించానని చెబుతుంది. ఆ యువతి ఎవరో కాదు, రైల్లో శ్రీమతి సుధా మూర్తి

గారు చేరదీసినప్పుడు దీన పరిస్థితిలో ఉన్న బాలిక! శ్రీమతి సుధా మూర్తి గారి చలవతో, పై చదువులు చదివి, అమెరికాలో ఉన్నత

స్థాయి వరకు ఎదిగిన యువతి! ఇంతకూ చెప్పేదేమంటే మనం చేసిన మేలు వృథా పోదని. ఇది నా స్వానుభవంతో కూడా

చెబుతున్నాను. నాకూ మీలాంటి అనుభవాలు ఎదురయ్యాయి. అలా అని నేను నా శాయశక్తులా ఇతరులకు చేయూత నీయడం మానలేదు. నేను చేబదులు గా ఇచ్చిన సొమ్ము, నాకు అవసరమున్నప్పుడు తిరిగి రాక, నేను ఎక్కువ వడ్డీకి అప్పు చేసి నా మాట

నిలబెట్టుకున్నాను. అవి జీవితంలోని భాగాలుగా పరిగణించాను తప్పితే, మనసు లో ఉంచుకుని బాధ పడలేదు.

అందుకని నేను మీకు విన్నవించేదేమంటే, మనం మన శాయశక్తులా తోటి వారికి సహాయ పడదాం. ఒక్కోసారి మనకు మనఃస్థాపంకలిగినా ఓర్చుకుందాం. మనలోని మంచిని పెంపొందిద్దాం. ఈ జీవన సంధ్యలో సమాజానికి చేతనైన సహాయం చేద్దాం.” అవధాని గారు కాస్త పెద్ద క్లాసే తీసుకుని, బయల్దేరడానికి లేచారు. తక్కిన వారు దాన్ని సహేతుకంగా తీసుకుని, ఆయన చెప్పిన అంశాలను

నెమరువేసుకుంటూ, తమ తమ నెలవులవైపు అడుగులు వేశారు.



-అంబల్ల జనార్దన్
8850349858

## నేలకొరిగిన అడవిబిడ్డ !!

తనువునందలి అణువుఅణువున
అడవి తల్లికి గుడిని కట్టీ
రక్ష చేసే శ్రీనివాసుని
నరికి వేసిరి !!

అడవి తల్లికి పచ్చదనమును
హెచ్చు చేయుచు పాటు పడగా
కుప్ప కూల్చిరి
మానవత్వము మరిచియున్ !!

భోరుమన్నది అడవి తల్లీ
రక్తమై కన్నీరు కార్చుతు
అడవి రక్షణ కొరకు బిడ్డను
కోలుపోయిన బాధతో !!

నింగి కెగసే తారవైదువా
అడవిలో చెట్టువై పుడుదువా
వాగు వంకల పారి అడవిలో
సవ్వడై వినిపిస్తవో ??

తల్లి దండ్రుల బార్య పిల్లల
తోడుగా పని చేయు మిత్రుల
వీడి పోయిన నేస్తమా
నీ పాదముల మా వందనం !!

-కొండా మోహన్,
7989748529

## మనిషిగా

కష్టమున్నచోట అధైర్య పడకుండా
పరిష్కారం వెదుకు
మనిషిగా మనసులోనిరాశ కలగకుండా
చైతన్యం మేల్కొలుపు
చీకటి కమ్మిందని నిరాశపడిపోకు
చిన్న దీపమైనా వెలిగించి
వెలుగును పంచడం మరచిపోకు
ఉన్నవాడికి ఏ సాయం
చేయకపోయినా పర్వాలేదు
పేదవాడికి కొంచమైనా చేయూతనందించు
సాటి మనిషిపట్ల దయకలిగి ప్రవర్తించు
మనుషులలో మనిషిగా
మానవతావాదిగా జీవించు

-డి.టి. హేమంత్ సింగ్
8121430560

## పడగనీడ

తల్లిదండ్రుల సమక్షం
ఓ రక్షణ కవచం
కన్నబిడ్డలకు
నీడలా వెన్నంటే ఉంటారెపుడూ...
క్రీనీడలై కనిపెడుతూనే ఉంటారు.
వేయికన్నులతో,
వేయి పడగల చల్లని నీడలో
పవళించిన కృష్ణుని లా చిందులతో
పరవశించాలని భావిస్తారు బిడ్డలను
కాలక్రమంలో ఓజోన్ పొరలా
ఈ రక్షణ కవచం చిరిగిపోయింది.
వాతావరణం కలుషితమైంది.

గురువు నీడలో
సకలవిద్యలూ నేర్వాలని
అపర సరస్వతి గా
మారాలని వదిలి వెళ్తాడు
ఓ వెర్రి తండ్రి.
గురువు ఆలోచనల్లో విషం పుట్టి
శిష్యురాలినే కాటేశాడు
ఇదో విషపు నీడ కాదా?

ఆడపిల్లకు తోడునీడవ్వాలని,
మనసా వాచా ఒకటవ్వాలని,
మాంగల్యబంధంతో పెనవేసి,
అల్లుడి చేతిలో పెడతారు
ఉన్నదంతా ఊడ్చిపెట్టి
స్వర్ణంతో మేనిని కప్పి
కులాసాగా,ఖుషీ చేసి
అత్యాశాపరుడై, దుష్టుడై,
కట్న పిశాచిగా మారి
అమ్మాయి ఉసురు తీసాడు.
ఇదో విషపు నీడ కాదా?

ప్రేమనే మాయలో పడి,
అందరినీ కాదని వెళితే,
అవకాశం వాదంతోనో,
అనుమానంతోనో
శవంగా మార్చి పారేశాడు.
ఇదో విషపు నీడ కాదా?

నీడగా ఉంటుందని
ఎండకు అలసిన దేహం
చెట్టు నీడలో సేదతీర చూస్తే
పిడుగు పడి మసైపోయాడు
ఇదో విషపు నీడ కాదా?

నీడలన్నీ, తోడులన్నీ
నిజమైనవీ, నిక్కమైనవీ కావు.
రక్షణ కవచాలసలే కాదు.
తస్మాత్ జాగ్రత్త.



-అమరజ్యోతి
9182873598

## ఏం గొప్ప నీవని....

ఏం గొప్ప నీవని ఎదురొచ్చి నిలవాలి
మానవా! అవని నీకు నూరేండ్లు తోడుగా!

చెట్టు చేమ నీకు తోబుట్టులై కడుపు
నింపగా...కళ్ళళ్ళ పెట్టుకుని చూడగా
నిప్పు నీరూ నీకూ చేదోడు వాదోడూ
జీవితాంతం నిన్ను కనిపెట్టుకోగా
// ఏం //

అంబరం గొడుగయ్యి ఆదరించేను
సంద్రములు నీకయ్యి తోడు నిలిచేను
సూర్యమా నిను తట్టి నిద్ర లేపేను
చంద్రమా నీ కొరకు జోల పాడేను
// ఏం //

కొండ కోనలు దండి దాపుగ నిలువ
నదులన్నీ నడిచొచ్చి దాహాలు తీర్చంగ
పశువులు పక్షులు నీ పక్షమే చేరంగ
ప్రాణ కోటిలో నీకు అధిపత్య మియ్యంగా
// ఏం //

సాటి మనిషిని కూడ సన్నుతించని నీకు
సర్వ సంపదల నొసిగి స్వాగతించేను
ప్రకృతి పదనిసల పాలించు తల్లీ
పాడి పంటలనిచ్చి పోషించు నిన్ను
// ఏం //

పానముండగనె నీవు పరితపించూ..
ప్రకృతి పట్ల బాధ్యతలు కలిగి
ప్రతి రోజు..ప్రతి పూట.. ఓ మిత్రమా
ఇవ్వడములోని ఇలవర్ల తెలుసుకుని
సాటి మనిషికి నీవు సాక్షిగా నిలువుమా
// ఏం //



-నగసూరి రాజన్న
918332953129

పుస్తక సమీక్ష

# కవిత్వానికి అత్మ ... చింతల తొవ్వ




ఆత్మీయతనంతా అక్షరాలకు అద్ది కవితలను రాశులుగా కుమ్మరించి నికార్సైన కవిత్వం తొవ్వలో నడిచేది ఈ కాలంలో కొందరు కవులే. అలాంటి వారిలో తుల శ్రీనివాస్ ముందు వరుసలో నిలబడతాడు . సాహితీ క్షేత్రానికి ఆలస్యంగా ప్రవేశించినా అనుభవాలను, తాను పడ్డ కష్టాలను గుండెల నిండా ఒంపుకుని నాణ్యమైన కవిత్వానికి బాటలు వేస్తూ వచ్చిన కవి తుల శ్రీనివాస్. ఆయన్ను కవిత్వంలో ఎంతో అనుభవం గడించిన వ్యక్తి గా చెప్పవచ్చు. జీవితాన్ని కవిత్వంలోకి వొంపుతున్న తీరును చూస్తే శ్రీనివాస్ కవిత్వంలో అందె వేసిన చేయి అనిపిస్తాడు. మొదటి ప్రయత్నంలోనే కవిగా నిలబడ్డాడు అని అనవచ్చు. అతని కవిత్వమంతా తెలంగాణ బోనమై ఊరేగుతుందనొచ్చు.

తుల శ్రీనివాస్ వృత్తి రీత్యా ఉపాధ్యాయుడైనప్పటికీ, ప్రవృత్తిరీత్యా సాహితీ ప్రేమికుడు. పుట్టినూరును మరువకుండా ప్రేమాను బంధాలను విడవకుండా కవిత్వమై నిలిచినోడు. తన తొలి సంపుటి పుస్తకానికి "చింతల తొవ్వ " అని పేరు పెట్టడంలోనే ఆయన ఔన్నత్యము ఎటువంటిదో అర్థమవుతుంది. ఈ కవితా సంపుటిలో మొత్తం 45 కవితలు ఉన్నాయి. ప్రతి కవిత దేనికదే ప్రత్యేకత కలిగి ఉంది. ఈ కవిత బాగుంది. అది బాగలేదు అని నిర్ధారించలేం. ఇందులోని కవితలన్నీ అతని ఆకాంక్షలకు, ఆలోచనలకు ప్రతిరూపాలుగా నిలుస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే అతని కవిత్వం అంతా భావ ప్రయాణం. చింతల తొవ్వ పేరును బట్టి ఆధ్యాత్మిక చింతన కాదు. అది సమాజంలోని మానవ సంబంధాల వంతెన గా పేర్కొనవచ్చు. ఆ పేరు వినగానే, చూడగానే మబ్బు పట్టి వర్షం కురిసినప్పుడు మట్టి వాసన వచ్చినట్లే ఆ కవితల్ని చూడగానే పల్లె వాసన పరిమళిస్తది. ప్రతి కవితాంశంలో తడి నిండిన అక్షర సమూహాలే కనిపిస్తాయి. తడి తడి జీవితం తన్మయం చెంది తాజాగా పలికినప్పుడే కవిత్వం అనేది మనసుకు హత్తుకుంటుంది. జీవితంలోని సంఘటనలను కవి తన ప్రతిభా కవిత్వంలో చూపిస్తాడు. ఎవరి కవిత్వంలో ఏ భావన పండాలన్నా ఆ కవిత్వంలో ఉత్పత్తి అయ్యే రసమే కీలకం. ఇది జీవితం కాచిన కవికే కవిత్వాన్ని వికసింపజేయడం సాధ్యమవుతుంది. జీవితాన్నే కవిత్వ ప్రయాణంగా భావించి కవిత్వంలో సాహిత్య పంటను విస్తారంగా పండిస్తున్న మనలోని కవి తుల శ్రీనివాస్. జీవితాన్ని తన ఎదలో అద్దుకుని, జీవితం చేత దిద్దబడిన కవి ఇతను. మట్టి పరిమళాలను, పల్లె భావోద్వేగాలను అక్షరాలలో ఒదిగించి కవిత రూపంలో వొంపిన నిమ్మలపు మనిషి తుల శ్రీనివాస్.

"చింతల తొవ్వ"లోని మొదటి కవిత లోనే.....

**"అక్కడ ప్రతి అమ్మ మది**
**పచ్చి పాలకుండే**
**ప్రతి అయ్య హృది**
**మల్లెపూల చెండే**
**ఈ గోడలూ ఆ ఇళ్లను**
**విడదీయలేవు**
**ఈ రేఖలు ఆ మనుషుల్ని విభజింపలేవు"** (పురిటి మట్టి ) అంటూ పందిరి తీగల్లా అల్లుకున్న మనుషుల మధ్య ఉన్న బంధాలను, మట్టితో ఉన్న సంబంధాలను తట్టి లేపుతాడు. మనసుల యొక్క గుణగణాలను, విశదీకరిస్తూ మట్టి యొక్క మహిమను కవి ఎంతో అందంగా చిత్రిస్తాడు . తుల శ్రీనివాస్ నిన్న మొన్నటి కవి అయినప్పటికీ, ఊహించని విధంగా బతుకు చిత్రాలను వడ్లను రాసులుగా పోసినట్టు కవితలను కుప్పలుగా పోసి కవిత్వాన్ని ఎంత ఎత్తుకు తీసుకపోవాలో అంత ఎత్తుకు తీసుకపోయి పాఠకుడికి పరిచయం అయ్యాడు . "జీవితంలో అనుభవించి, కడుపులో మండిన వాడే, జీవితపు లోతుల్లోకి వెళ్లిన వాడే నిజమైన కవిత్వం రాయగలడు" అన్న విషయం తుల శ్రీనివాస్ విషయంలో మరోసారి రుజువయింది. శ్రీశ్రీ అన్నట్లుగా కవిత్వానికి కాదేది అర్హము అన్నట్లుగా ... తుల శ్రీనివాస్ జీవితంలో చిన్న అంశాన్ని కూడా కవితా వస్తువుగా తీసుకొని సఫలీకృతుడైనట్లు చెప్పవచ్చు. అందుకు ఉదాహరణగా "పిన్నీస్" అనే కవితలో (పేజీ నెంబర్ 64) ఇట్లా అంటాడు.

**"అమ్మ రవిక చినిగినప్పుడు**
**అక్క లంగా బొందె తెగినప్పుడు**
**మానాన్ని కాపాడి**
**దారిద్ర్యాన్ని దాచింది ఈ పిన్నీసే"**

**డికెళ్లే వేళ...**
**గుండీలూడిన నెక్కరకో**
**కుట్లు పిగిలిన చొక్కాకో**
**పిన్నీస్ పెట్టి బుగ్గను ముద్దాడి**
**అమ్మ కళ్ళకద్దుకున్న క్షణం**
**ఎందుకో.. ఇప్పటికీ**
**వెంటాడి గుచ్చుతూనే ఉంది**
**"రాలిపోయిన బాల్యస్మృతులన్నీ**
**పొరలు పొరలుగా**
**కుట్టుకోవాలనిపిస్తది"**అని.

సమర్థుడైన కవి మామూలు వస్తువును కూడా గుండె లోపల ఎట్ల గుచ్చాలో ఈ కవితను మంచి ఉదాహరణగా చెప్పకనే చెప్పవచ్చు.

చిన్న వస్తువు కూడా మానాని ఎట్ల కాపాడిందో, చిన్నప్పుడు శీలాన్ని ఎట్లా దాచిపెట్టిందో కవి ఎంత హృద్యంగా విశదీకరించాడో ఈ కవితను చదివితే అర్థమవుతుంది. ఈ సంకలనానికి ముందుమాట రాసిన ఆచార్య యన్.గోపి గారు తుల లేని కవితలు అంటూ పొగుడుతూ.... శ్రీనివాస రాసిన "పిన్నీస్" కవిత తనకంటే బాగా గొప్పగా రాశాడని కితాబివ్వ డమనేది గొప్ప విషయం. ఈ ఒక్క మాట చాలు శ్రీనివాస్ కవి అని చెప్పడానికి.

అలాగే "అనగనగా ఓ సైకిల్" (పేజీ 88)అనే ఇంకో కవితలో...

**"కావంచి తొక్కుతూ**
**కాళ్లు సవరించుకునే వేళ...**
**జీవితంలో ఎత్తు పొలాలు**
**సహజమేనని ఎరక చేస్తూ**
**ముందుకు సాగే తత్వజ్ఞాని!!**
అంటూ సామాన్యుని రథచక్రం సైకిల్ జీవితంలో ఎట్లా ఉపయోగపడిందో, దాన్ని చూసి మనం ఏం నేర్చుకున్నామో, సైకిల్ మన అనుబంధానికి ఎంత ఆధారమో కవి వ్యక్తీకరించడం గొప్ప విషయం.

తెలంగాణ భాష సంస్కృతిని కాపాడుకునే విధంగా కవిత్వాన్ని కార్యంగా మలుచుకుని పాఠకుల అంతరంగాలను అవగాహన చేసుకుని జాగృత పరిచే భావకుడు తుల శ్రీనివాస్. తన అంతరంగంలో దాచుకున్న ఊహ చిత్రాలను కవిత్వంలోకి వొంపుతాడు. ఈ సంపుటిలోని కొన్ని కవితలను మన ఇండ్లలో గోడలకు బొమ్మల్లాగా తగిలించుకునేంత విధంగా ఉంటాయనడంలో అతిశయోక్తి కాదు. వాస్తవం ఇది. తోటలో సీతాకోకచిలుకల్లాగా పుస్తకంలో మరి కొన్ని కవితలు మనకు దర్శనమిస్తాయి. "మట్టి శిల్పం" అనే కవితలో ఉత్పత్తి కులాల యొక్క సౌందర్యాన్ని వివరిస్తాడు. కుమ్మరి యొక్క జీవితాన్ని ఏ కరువు పెడతాడు. కుండ యొక్క ప్రాధాన్యత తెలుపుతాడు ఈ విధంగా...

**"పచ్చి మట్టికి పురుడుపోసి**
**అద్భుతమైన ఆకృతులను చెక్కే**
**నీ ముని వేళ్ళ సంస్కారానికి**
**తనువెల్లా పులకిస్తాను "**
**మట్టి ధర్మాన్ని /మనిషి ధర్మంతో**
**ముడిపెట్టిన మహిమ నీది /**
**మావికుండ నుండి**
**అంతిమకుండా (తలగోరు )దాకా మనిషితో పెన వేసుకున్న బంధాన్ని**
**నిర్దాక్షిణ్యంగా తుంచి "** అంటూ మానవ నాగరికతలో ఉత్పత్తి కులాల యొక్క ప్రాధాన్యతను నొక్కి చెబుతూ, మానవ జీవితంలో కుండ అనివార్యమైన విషయాన్ని ఎరుక జేస్తూ, జీవితంలోనుండి కుండను నెట్టివేసిన విషయాన్ని నర్మగర్భంగా విశదీకరించాడు. చివరికి మ్యూజియంలోకి చేర్చిన విషాద స్థితిని శ్రీనివాస్ హృద్యం గా చిత్రించాడు. నానాటికి అడుగంటిన కులవృత్తిపై, తీరు తెన్నులపై మనసును కలచి వేసే విధంగా వ్యక్తీకరించాడు. దుర్భరమైన జీవిత విషయాన్ని గంభీరంగా కవిత్వీకరించడంలో శ్రీనివాసుది అందెవేసిన చెయ్యి. కనబడకుండానే కన్నీటి పర్యంతం చేయడంలో ఆయనకు బాగా తెలుసు. ఊరన్న తర్వాత ఉద్వేగం తప్పదు. మనుషున్న తర్వాత అనుబంధాలు తప్పవు. కవి అన్నాక స్పందించక తప్పదు. కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలు అల్లుకున్నట్టే అల్లుకుంటూ అల్లకల్లోలం అవుతున్న రీతిని ఎండగడతాడు. అతడు కవి కదా! ఉన్నతంగా వ్యక్తీకరిస్తాడు. ఉన్నతీకరిస్తాడు. ఏడుస్తాడు ఏడిపిస్తాడు. ఊరిడిస్తాడు. ఇవన్నీ శ్రీనివాసులో దాగి ఉన్న కలలు.

ఒక మాటలో చెప్పాలంటే తుల శ్రీనివాస్ తన కవితలలో కొండంత భావం ఇముడిస్తాడు. మొదటి సంకలనం ద్వారానే తెలుగు కవిత్వంలో ముఖ్యంగా తెలంగాణ కవిత్వంలో ఒక పాయగా పారుతున్నాడు శ్రీనివాస్. "అమ్మ స్థితి" చెప్పడానికి శ్రీనివాస్ చేకూర్చిన ఈ కింది వాక్యాలు చాలు...

**" ఒకప్పుడు అమ్మంత ఇల్లు**
**ఇప్పుడేమో గదంతా అమ్మ"**
(పేజీ 58)

అమ్మంత ఇల్లు తిరిగేస్తే ఇల్లంత అమ్మ. అది అమ్మ వైభవము, సామ్రాజ్యం. ఎటు చూసినా అమ్మే. అమ్మ విశ్వరూపం. అంతటి ఆకాశమంత అమ్మ గదికే పరిమితం చేయబడింది. అని అమ్మ గురించి పట్టించుకునే నాథుడే లేడని కవి వ్యక్తీకరించాడు.

ప్రపంచీకరణ జరిగిన నేపథ్యంలో.. రైతు యొక్క ప్రధాన రోజుకు తగ్గిపోతుంది. రైతే దేశానికి వెన్నెముక అన్నది ఓనాడు. రైతుల కష్టార్జితాన్ని సర్వనాశనం చేస్తుందీ నాడు. రైతు గురించి కూడా శ్రీనివాస్ కరిగి కన్నీరయ్యాడు.

"ఒడ్డోరంజెక్కి ఒంపు మిర్రలు సైజేసినంక /ఇర్రంవంటున్న బుర్ర కాళ్ళు /పగిలి పచ్చెలైన పాదాలు జూస్తే / మా బరువే కాదు /నాయిన దేశం బరువు మోస్తున్నట్టు అనిపించేది" అంటూ నాయన పడ్డ కష్టాలను తెలిపాడు. శ్రీనివాస్ తన కవిత్వంలో అలాయ్ బలాయితో అలరిస్తాడు. పెద్దగట్టు జాతరని మైమరిపిస్తాడు. మట్టి మురిసిపోయే కవిత్వం. నుడికారాలు, పదబంధాలూ ప్రతి కవితలో సాక్షాత్కరిస్తాయి. కొత్త కొత్తగా కవితా దోస్తులవుతాయి.

అదేవిధంగా ''గుప్పెడంత జీవితం" కవిత (పేజీ 19) లో విశ్వం పుట్టుక గురించి, మనిషి అహంకారం గురించి ఈ విధంగా వర్ణిస్తాడు.

**"ఎన్నో మహాయుగాలు యాతన పడి**
**ఎన్ని మహాప్రళయాలు దాటుకుని**
**విశ్వం తన ఆకృతి చెక్కుకుందో..."** అంటూ శ్రీనివాస్ విశ్వం గురించి తెలియజేస్తూ సహజ సిద్ధంగా ఏర్పడ్డ విధానాన్ని తెలియజేశాడు.

అటువంటి ప్రపంచంలో మనిషి తన నైజాన్ని ఎట్ల ప్రదర్శిస్తున్నాడో స్పష్టపరిచాడు.

**''సృష్టికి ప్రతిసృష్టి నీకే సాధ్యమంటూ..**
**ఎందుకు నీకీ మిడిసిపాటు!**
**గట్టిగా రాస్తే నీ చరిత్ర సమస్తం**
**ఒక్కటంటే ఒక్క వాక్యం కాదు!!"**

**"నీటి బుడగ లాంటి జీవితం**
**పగలకముందే...**
**నీవైన ఆనవాలు కొన్ని**
**ఈ నెల పై చెక్కు**
**మట్టిలో కలిశాక కూడా**
**మనిషివై మిగులుతావు.... "**
అంటూ మనిషి యొక్క ఇజాన్ని, నైజాన్ని, అహంకారాన్ని తూర్పారబడతాడు. మనిషిగా పుట్టినందుకు మనిషి తనంతో బతుకమంటాడు కవి. మనిషి నచ్చిపోయినంక మంచితనమే చరిత్రలో మిగుల్తది అంటాడు. ఇంకోచోట "తీయటి జ్ఞాపక"మనే కవితలో సవుదు మిద్దె ఇల్లు గురించి హృదయ విధారకంగా, కళ్ళు చెమ్మగిల్లేలా ఈ విధంగా వర్ణిస్తాడు.

**"పొద్దూకాల సుట్టమై వచ్చిన జల్లు**
**చిల్లుల దుప్పటి కప్పుకున్న**
**సౌడు మిద్దె సంసారాన్ని**
**సిన్నతనం చేస్తుంటే....**
**యీ కొంప నాశనం గాను**
**ఎప్పటికీ ఈ బాధలు తప్పవాయే**
**అని అమ్మ శోకాలు పెడుతుంటే**
**గుబులెక్కిన నా గుండె**
**కొండ లెక్క ఉరిమేది"**
**పెద్ద కర్రతో అన్న కింది నుండి**
**మిద్దెను మద్దిల దరువేస్తుంటే...**
**చీకటి వేదికపై చినుకులు**
**పూంజితం ఆడుతుంటే....**
**"ఇప్పుడు అక్కడే తియ్యని**
**జ్ఞాపకాలని కాసే మామిడి చెట్టు**
**మా నాన్నల నిలబడి ఉంది...."**
అంటూ వర్షం వచ్చినప్పుడు ఇల్లు కురుస్తుంటే పడిన బాధలను ఏ కరువు పెట్టాడు. ఆర్థిక పరిస్థితులను చెప్పకనే చెప్పాడు. అదేవిధంగా "ఓ మనిషి కావాలిప్పుడు" అనే మరో కవితలో పల్లె ప్రజల యొక్క గుణగణాలను హృదయాంతరాలలో నుంచి ఇట్లా వ్యక్తపరిచాడు.

**"తిన్నావా నాయనా.. ఏం కూర...**
**ఏం పని చేస్తుండ్రు బిడ్డా..."**
**అనే మాటలు అల్లుకుంటూ**
**మల్లె పందిరయ్యేటోళ్లు....**
**అర్ధమ్మ రాత్రి దాకా**
**దుఃఖపు చీకట్లనల్లిస్తూ**
**కష్టాల గూట్లో**
**కన్నీటి దీపాలయ్యేటోళ్ళు...."**
అంటూ ఒకప్పుడు పల్లె వాసులూ ఎంత నిజాయితీగా, ఆప్యాయంగా, ప్రేమతో ఉండేవారో తన జ్ఞాపకాలని తుల శ్రీనివాస్ ఎరుకజేశాడు.

కవిగా,రచయితగా రాణిస్తూనే ఉపాధ్యాయుడిగా తన వృత్తి ధర్మాన్ని నెరవేరుస్తూన్నాడు. తొట్ట తొలుతనే "చింతల తొవ్వ" సంపుటితో సాహితీ ప్రపంచానికి పరిచయమయ్యాడు. శ్రీనివాస్ ఎంతో మృదుస్వభావి. ఆయన రాసిన ఇందులోని కవితలన్నీ మంచివే. కవిత్వం లేకుండా ఏ వాక్యము లేదు. అంతటి బలమైన కవి. కవిత వస్తువుల్లోకి దూరి కరిగి కవితగా మారి అద్భుతమైన కవిత్వాన్ని ఆవిష్కరించాడు. ఇది అందరి నుంచి కాదు. ఇది ఒక రకమైన మార్మికమైన ధ్యానస్థితి. అయినోళ్లందరిని అక్షర బంతికి పిలుచుకుని కవితోత్సవం చేసుకున్న కవి శ్రీనివాస్. ఈయన గురించి ప్రముఖ జీవకవి మునాస వెంకట్ గారు పుస్తకానికి ముందు మాటలో ఇట్లా చెప్పాడు.

"క్రీస్తుశకం. 21 వ శతాబ్దంలో నల్లగొండ జిల్లా అడ్డూరులో జన్మించిన తెలంగాణ కవి తుల శ్రీనివాస్ అని రేవటి సాహితీ చరిత్ర చెప్పుకుంటోంది."అని.

కాలుకు తగిలిన గాయపు మచ్చలు చూసినప్పుడల్లా నడిచి వచ్చిన తవ్వే యాదికొస్తది. ఎక్కిల్లు పట్టినప్పుడల్లా ఎక్కొచ్చిన వంపు మిర్రలు కండ్లల్ల మెదలుతై. గుండెల నెనరు పొంగినప్పుడల్లా ఊరు ముచ్చటే గుర్తుకొస్తది.

ఆ గాలి నాకు ఏం మంత్రమూదిందో....

ఆ మట్టి నన్ను ఏం మత్త గొలిపిందో... అని తుల శ్రీనివాస్ తన మతిల మాట బయట పెట్టిండు. కన్నతల్లి అయిన పుట్టినూరు పై ఉన్న మమకారాన్ని వ్యక్తం చేస్తూ, దేవుని గుడసొంటి పల్లె తల్లి పాదాలకు ప్రణమిల్లాడు అంటే శ్రీనివాసులో మట్టిపై ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతుంది. కండ్లు తెరిచిన గడ్డం మీదనే ఆఖరి ఊపిరి వదలాలని పిస్తదని విడదీయలేని బంధాన్ని నెమరేసుకుంటున్నడు.

తుల శ్రీనివాస్ రాసిన "చింతల తొవ్వ " పుస్తకం పాఠక లోకానికి మరింత చేరువ కావాలని, ఒక కవిగా,రచయితగా, సమీక్షకుడిగా మనసారా కోరుకుంటూ, అతని కలం నుంచి సమాజాన్ని తట్టిలేపే మరెన్నో కవితలు జాలువారాలని ఆశిద్దాం.



–కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
9441561655

## ఆడపిల్లలే ఆస్తి..!

అమ్మాయి పుడితే
అవహేళన చేయకుము..!
అమ్మలా చూసుకుంటు
అన్ని సమకూర్చుము..!!

బాలిక పురుడోసుకుంటే
భారమని భావించకుము..!
భద్రత కల్పించుకుంటు
బాగోగులు చూడుము..!!

చదివించడమెందుకని
చాకిరిని చేపించకుము..!
కట్నాలా తిప్పలని
కూలిపనికి పంపకుము..!!

ఆడమగా అనుకుంటు
తేడాలు చూపకుము..!
అన్నింట్లో అండగుంటు
అబలయన్నది మరిపించుము.!!

ప్రతిభను గుర్తించి
ప్రోత్సాహమందించుము..!
సమయాన్ని వెచ్చించి
సబలని నిరూపించుము..!!

ఆడపిల్లలే ఆదర్శమని
అందరికీ తెలుపుము..!
ఆడపిల్లలే ఆస్తియని
అవనియంత చాటుము..!!



–పసుల. శంకర్
9542181301

## బతుకు కుంపట్లో పిడకలు

పేదరికమే శాపమైన జీవచ్ఛవాలు
అనాథల్లా కడు హీన బడుగులు
అతుకుల గతుకుల బతుకులు
పొయ్యిలో మండుతున్న కట్టెలు
కుతకుత ఉడుకుతున్న మక్క కంకులు
ఆకలి దోబూచులాటల పోరాటాలు
జానెడు పొట్టకు బోలెడు వెతలు !

నిప్పుపై మాడుతున్న చీకుల్లా..
ఆకలి పెయ్యిలో మాడుతున్న పేగులు
పంటి కింద నలిగే నీసు ముక్కల్లా..
చిరు ఆశల గాలం మింగిన చేపల్లా..
ఎండల్లో వేలాడే
ఒట్టి తునకల దండల్లా..
ఉన్నోడి ఊడిగంలో కండల్లేని డొక్కలు
నిరుపేద బతుకుల్లో అస్తమయాలు !

బతుకు కుంపట్లో కాలే పిడకలు
అలుపెరుగని శ్రామిక అభాగ్యులు
సూర్యోదయమే కరువైన జీవులు
బతుకు రాయిపై సమ్మెట పోట్లు
రోట్లో నలిగే మిరపకాయ తొక్కలు
చాకలి బండపై బాదే బట్టపేగులు
అస్థిపంజరాలైన ఎముకల గూళ్లు !

అమానవీయ అక్కర్లేని కాయాలు
గుడిసెకు లెక్కలేనన్ని బొక్కలు
మాసి చిరిగిన గుడ్డల్లో ధీనులు
పండు తిని చెత్తలో విసిరిన తొక్కలు
పేవ్‌మెంట్లే వారి ఇల్లు వాకిళ్లు
కదులుతున్న దౌర్భాగ్య శవాలు
ఎవరికీ గిట్టని వెలివేసిన తనువులు !



–డా: బుర్ర
మధుసూదన్ రెడ్డి
9949700037

## నానీలు

శత్రువులతో
పోరాటమే నిరంతరం
రోగనిరోధక శక్తి
ఆయుధంతో!

అజ్ఞానం
మూఢవిశ్వాసాలను
ఖండించే ఆయుధం
అక్షరమే!

ఆత్మబలం
ఆత్మవిశ్వాసాలే
ఆయుధాలవాలి
అతివలకు!

ఏనుగు వంటి
సమస్య
చీమలా మారు
మనోధైర్యపు ఆయుధంతో!

అవిశ్రాంత పోరాటమే
అన్నదాతకు
హలము
ఆయుధము కాగా!

ప్రజాస్వామ్యాన్ని
పరిరక్షించేందుకు
సరైన ఆయుధం
ఓటే!

స్వాతంత్ర్యం
సిద్ధించింది
అహింస,సత్యాగ్రహాలే
ఆయుధాలు కాగా!!!



–చంద్రకళ. దీకొండ
9381361384

## హైకూలు

ఒకటికి ఒకటి ఫ్రీ
పుట్టటానికి గిట్టటంలా.

నే వెళ్లాల్సిన చోటికి
టికెట్ లేదు ఫ్రీగా పైకి

కవి కలంతో ఇంద్రధనస్సు
పత్రిక ఆకాశంలో

వాడి మాటల్లో మజా
ప్రక్కవానికి టోపీ తప్పదు

చిగురాకు లేత పరువం
కన్నెతనం ప్రతీకలే!

మల్లె,వానజల్లు తలపు
పులకింతల గుర్తులే!



–యలమర్తి అనూరాధ
9247260206

# నిర్బంధమే ఆంగ్ సాన్ సూకీ ఆచూకి

మయన్మార్ ప్రజాస్వామ్య ఉద్యమకారిణి, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ అధినేత్రి ఆంగ్ సాన్ సూకీ ప్రజాస్వామ్య మయన్మార్ కోసం ఉద్యమిస్తూ సైనిక జుంటా ప్రభుత్వంచే అన్యాయంగా అత్యధిక కాలం పాటు నిర్బంధంలో కొనసాగారు. ఒక రకంగా చెప్పాలంటే 'ఆమె నేటికి కూడా నిర్బంధమే ఒక జీవితంగా జీవిస్తున్నారు'. ఆమె తండ్రి ఆంగ్ సాన్ బర్మా స్వాతంత్ర్యం కోసం ఉద్యమించి చివరికి ప్రత్యర్థులచే హత్య చేయబడ్డారు. సూకీ తన తండ్రి ఆంగ్ సాన్ నుండి ఉద్యమ వారసత్వాన్ని స్వీకరించి పలు నిర్బంధాలు అధిగమించి ప్రజాగొంతుకగా మయన్మార్ లో 'ప్రజాస్వామ్య సాధన'కు ఉద్యమించారు.

జుంటా ప్రభుత్వం సూకీని 1989 జూలై 20 నాడు గృహ నిర్బంధం గావించి 1995 జూలై 10 నాడు స్వల్ప ఆంక్షలతో విడుదల చేశారు. మరోసారి జుంటా ప్రభుత్వం సూకిని 2000 సెప్టెంబర్ 23 నుండి 2002 మే 5 వరకు గృహ నిర్బంధంలో ఉంచి 19 నెలల తర్వాత 2002 మే 6 నాడు ఐక్యరాజ్యసమితి జరిపిన చర్చల ఫలితంగా విడుదల చేసింది. కొంతకాలం తర్వాత ప్రభుత్వం మళ్ళీ ఆమెని అరెస్ట్ చేసి రంగూన్ లోని ఇన్సేన్ జైలులో బంధించి 2003 లో గృహ నిర్బంధానికి పంపింది. 2005 నవంబర్ 28 నాడు సూకీ గృహ నిర్బంధాన్ని మరో ఏడాది పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. 2006 మే 27 నాటికి సూకీ గృహ నిర్బంధం ముగియాల్సి ఉండగా బర్మా ప్రభుత్వం దానిని మరో ఏడాది పొడిగించింది.

2007 మే 25 నాడు ఐక్యరాజ్యసమితి విజ్ఞప్తి చేసినప్పటికీ గృహ నిర్బంధాన్ని మరో ఏడాది పొడిగించారు. మరోసారి 2009 మే 13 నాడు సూకీని అరెస్ట్ చేసి గృహ నిర్బంధ నిబంధనలు ఉల్లంఘించినట్లు అభియోగాలు మోపి 2009 ఆగస్టు 11 నాడు దోషిగా నిర్ధారించారు. ఆమెకి మూడు సంవత్సరాలు జైలు శిక్ష విధింపబడిననూ అంతర్జాతీయ సమాజం వత్తిడి దృష్ట్యా దాదాపు సగం శిక్ష పూర్తి అయ్యాక 2010 నవంబర్ 13 నాడు సూకీ గృహ నిర్బంధం నుండి విడుదలయ్యారు. సూకీ 1989 నుండి 2010 మధ్య గల 21 సంవత్సరాలలో మొత్తంగా 15 ఏళ్ళ పాటు గృహ నిర్బంధంలో కొనసాగడం గమనార్హం.

1990 తర్వాత 2016 లో తిరిగి బహుళ పార్టీ ఎన్నికలు దేశంలో తొలిసారిగా స్వేచ్ఛగా జరుగగా నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ పార్టీ 86 శాతం సీట్లు గెలుపొంది చారిత్రాత్మక విజయాన్ని సాధించిననూ సూకీ దేశ అధ్యక్షురాలు కాలేకపోయారు. మరోసారి 2020 నవంబర్ 8 నాడు జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ (ఎన్. ఎల్. డి ) మెజారిటీ సీట్లను గెలుచుకుని విజయం సాధించింది. 2021 ఫిబ్రవరి 1 నాడు కొత్తగా ఎన్నిక అయిన పార్లమెంట్ మొదటి సెషన్ ని నిర్వహించాల్సిన ఆ రోజున సైన్యం అన్యాయంగా అధికారాన్ని హస్తగతం చేసుకొని సూకిని అరెస్ట్ చేసింది. సాధారణ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో ఆమెని పదవి నుండి తొలగించారు. అప్పటి నుండి సూకీని నిర్బంధంలోనే ఉంచి కేసులు మోపుతున్నారు.

2021 ఏప్రిల్ 1 నాడు సూకీపై అధికార రహస్యాల చట్టాన్ని ఉల్లంఘించినట్లుగా ప్రకటించారు. 2021 డిసెంబర్ 6 నాడు సూకీకి 4 సంవత్సరాల జైలు శిక్ష విధించబడింది. 2022 జనవరి 10 నాడు మిలటరీ కోర్ట్ మరో ఆరోపణపై వాకీ– టాకీలను స్వంతం చేసుకోవడం, కరోనా నియమాలను ఉల్లంఘించడం వంటి అనేక ఆరోపణలపై అదనంగా నాలుగు సంవత్సరాల శిక్ష విధింపబడింది. 2022 ఏప్రిల్ 27 నాడు అవినీతి ఆరోపణలపై జుంటా కోర్ట్ ఆమెకు అయిదు సంవత్సరాల జైలు శిక్షని విధించింది. 2022 ఆగస్ట్ 15 నాడు మరో నాలుగు అవినీతి ఆరోపణలపై దోషిగా తేల్చారు. దేశద్రోహం, అవినీతి తదితర ఆరోపణలపై సూకికి 17 సంవత్సరాల జైలు శిక్ష విధించబడింది. అభియోగాలు, గృహ మరియు జైలు నిర్బంధాలు ఆమె జీవితంలో నిత్యకృత్యం కావడం విషాదకరం.

సూకీపై మొత్తం 18 నేర అభియోగాలు మోపారు. ఆమె వంద ఏళ్లకు పైగా శిక్షలు అనుభవించాల్సి ఉంటుంది. అయితే వాటన్నింటిని నిర్ద్వంద్వంగా ఆమె ఖండించారు. 2022 సెప్టెంబర్ 2 నాడు ఎన్నికల్లో జరిగిన అవినీతి కేసులో సూకికి మరో మూడేళ్ళ పాటు శిక్షను విధిస్తూ సైనిక కోర్ట్ తీర్పుని వెలువరించింది.

అయితే ఇప్పటికే పలు కేసుల్లో ఆమెకు 17 ఏళ్ల జైలు శిక్ష ఖరారు కాగా ఈ తాజాగా విధించిన శిక్ష దానికి అదనపు శిక్ష కావడం గమనార్హం. మయన్మార్ లో సైనిక పాలన రద్దు కోసం ఉద్యమించి స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం కోసం సుదీర్ఘ పోరాటం చేసిన సూకీ ప్రస్తుత వయస్సు 76 సంవత్సరాలు. జీవిత చరమాంకంలో ఉన్న ఆమెపై సైనిక జుంటా కోర్ట్ అన్యాయంగా శిక్షలు విధించడం కర్కోటకానికి నిదర్శనంగా నిలుస్తుంది. ఆమెపై అన్యాయంగా మోపబడిన నేరాలకు శిక్షలు అనుభవించడానికి ఆమె జీవిత కాలం కూడా సరిపోదు. అందువల్ల సైనిక జుంటా ప్రభుత్వం మానవతా దృక్పథంతో సూకిని నిర్బంధం నుండి విముక్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రోహింగ్యాల సమస్యలపై అంతర్జాతీయ స్థాయిలో విమర్శలు ఎదుర్కోవడం మినహాయిస్తే మిగతా అన్ని ప్రజాస్వామిక ఉద్యమాలలో సూకీ ప్రజాస్వామికంగా వ్యవహరించారు. 'నిర్బంధమే ఆంగ్ సాన్ సూకీ ఆచూకి' అనే దానికి తార్కాణంగా నిలిచి కళ్ళ ముందు కదలాడుతున్న సూకీని నిర్బంధం నుండి విముక్తి గావించేందుకు ప్రగతిశీల ప్రజాస్వామ్య శక్తులు అంతర్జాతీయంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైనది.



– జె.జె.సి.పి. బాబూరావు
సెల్: 94933 19690

## మనిషి ప్రేమ

మనసున్న మనిషి ప్రేమ అపూర్వం
మనసు మనసుతో కలిసినప్పుడు
మాయని మమతల్లా ఉండాలి.

జీవన వలయం చుట్టూరా పెనవేసుకున్న అనుబంధం
మల్లెపందిరిలా పైకి పైకి పాకాలి.

అనుబంధాన్ని ఆత్మీయతల్ని తాకట్టుపెట్టే ప్రస్తుత కాలం
ఎంతో కాలం ఉండదు.

మళ్లీ మన మనసుల్లో
మానవతా ప్రేమమయ సమాజం ఉదయిస్తుంది.

జీవితం మనిషికి ఇచ్చిన వరం
అది మానవుడు పొందాల్సినటువంటి
ఎన్నో ఆత్మీయత బంధాలకు

నిన్ను నీవు గొప్పగా తలుచుకోకు
గోదావరి ప్రవాహం ఎప్పుడూ గంభీరంగా ఉన్న
తన గొప్పతనాన్ని తనే చాటదు

సంపెంగ మల్లీ మొల్ల గులాబీ పద్మం కలువ పువ్వు
ఏది విరిసిన పరిమళాలను వెదజల్లుతూనే ఉంటుంది.

ఎప్పుడూ తన గొప్పతనాన్ని తన రంగును
తన పరిమళాన్ని చూసి గర్వపడవు ఏ పుష్పాలు
అలాగే కొద్ది మంది తమలోని శక్తిని చూసి గర్వపడితే

అంతకంటే మూర్ఖత్వం ఏది ఉండదు
మనసు పరిమళించాలి మమత పెంచుకోవాలి.

మర్యాద గౌరవాలకు
ఉన్న స్థానం ఉన్నతంగా ఎదగాలి.

ఆకాశంలో ఎగిరే గాలిపటం
ఎంత ఎత్తుకు ఎగిరిపోతుందో ఎవరికీ తెలియదు.

అలాగే మనిషి కూడా గర్వపడితే ఎంత ఎత్తుకు ఎదిగినా
క్రింద భూమిని చూసుకుని నడవాలి.

అన్నింటికంటే మనిషికి భూమి ఆకర్షణ అద్భుతం అమోఘం
అమూల్యం అని తెలుసుకో మనిషి నడుచుకో మనిషి
నేస్తం ఎదిగిన కొద్ది
ఒదిగి పోవడం మర్చిపోకు....



–డాక్టర్ సిహెచ్ ఆంజనేయులు
7702537453

## తాను తవ్వుకున్న గోతిలో (కథ)

తోడేలు ఒకటి చీకట్లో ఒక నీటి గుంటలో పొరపాటున పడింది .అది 'రక్షించండి .రక్షించండి 'అని రాత్రంతా కేకలు వేసింది .కానీ దాన్ని ఎవరు కాపాడలేదు.

ఒక ఉదయాన ఒక కుక్క ఒకటి కొత్తగా అడవికి చూద్దామని వెళ్ళింది. దానికి తోడేలు అరుపులు వినిపించాయి .అది ఆ నీటి గుంట వద్దకు వచ్చి తోడేలుతో "అయ్యో! నీటి గుంటలో పడిపోయావా!" అని అంది . "అవును .నన్ను రక్షించు. నీకు పుణ్యం ఉంటుంది "అని వేడుకోలుగా అంది తోడేలు . "నాకు నిన్ను కాపాడాలనే ఉంది .కానీ నీవు పైకి వస్తే నన్ను ఏమైనా చేస్తావేమోనని భయంగా ఉంది!" అని అంది కుక్క. అప్పుడు తోడేలు " లేదు. నా మాట నమ్ము .నేను నీతోని స్నేహంగా ఉండాలని అనుకుంటున్నాను. నమ్మకాన్ని మించింది ఏముంది? నీకు అంతగా నాపై అనుమానం ఉంటే నీవు పరిగెత్తి దగ్గరలోని చెరువులో మునుగు. నీకు ఈత వస్తుందని అనుకుంటున్నాను. నాకు ఈత రాదు. అందువల్ల నిన్ను పట్టుకోలేను కదా!" అని అంది తోడేలు.

అప్పుడు కుక్క సరేనని ఒక పొడవాటి కర్ర సాయంతో ఆ తోడేలును కాపాడింది. తోడేలు పైకి రాగానే వెంటనే కుక్క భయంతో పరిగెత్తి ఆ చెరువులో మునిగింది .కుక్క చాలా సేపు చూసినప్పటికిని తోడేలు అక్కడకు రానేలేదు .తోడేలును నమ్మిన కుక్క తిరిగి దాని వద్దకు వచ్చి "నిన్ను నమ్మాను మిత్రమా!" అని అంది .అప్పుడు తోడేలు "ఇకనుండి మన ఇద్దరం కలిసి ఉందాం "అని అంది. అందుకు కుక్క సరేనంది. తోడేలు తాను వేటాడిన జంతు మాంసాన్ని కుక్కకు పెట్టసాగింది. కుక్క కూడా దానితో సఖ్యంగా ఉండసాగింది.

ఇది గమనించిన నక్క ఒకటి వాటి స్నేహాన్ని చూసి కన్ను కుట్టి అది వాటిని విడదీయాలని అనుకొంది. అది కుక్కతో తోడేలుపై లేనిపోని చాడీలు కల్పించి చెప్పింది . "నిన్ను తోడేలు చంపాలని చూస్తున్నది తెలుసా!" అని కుక్కతో అంది. కుక్కకు తోడేలుపై అనుమానం కలిగింది .

అలాగే నక్క తోడేలుకు కూడా కుక్కపై లేనిపోనివి కల్పించి చెప్పింది. తోడేలుకు కూడా కుక్కపై అనుమానం పెరిగింది .తోడేలు తన మాంసాన్ని కుక్కకు పెట్టడం మానుకొంది. కుక్కకు కూడా అనుమానం బలపడి ఒకరోజు నక్క లేని సమయం చూసుకొని తోడేలుతో "నీలో చాలా మార్పు వచ్చింది. నాకు నక్క చెప్పింది నిజమేననిపిస్తుంది" అని అంది .అవే మాటలు తోడేలు కూడా అంది. అప్పుడు అవి రెండు విడదీయడానికి ఈ చాడీలు నక్క చెప్పిందని నిర్ణయానికి వచ్చాయి .దాని మాటలను ఇక ముందు నమ్మకుండా దాని ముందు శత్రువులు గానే తాము నటించాలని అనుకున్నాయి.

నక్క కుక్కతో "నీకు తోడేలు పీడ వదిలించుకొనే ఒక ఉపాయం చెబుతాను. విను .రేపు నీవు నా వద్దకు తీసుకొని రా !నేను ఈ రాత్రి ఒక లోతైన గొయ్యిని తవ్వుతాను. దానిని రెండు కాళ్లపై నిలబడునట్లు చెయ్యి. ఆ తర్వాత దాన్ని ఆ గొయ్యిలో తోసివెయ్యి. నేను కూడా దానిని ఒక త్రాడుతో వెనుక నుండి లాగుతాను "అని అంది. కుక్క సరేనంది. ఆ తర్వాత కుక్క తోడేలుకు నక్కపన్నిన పన్నాగాన్ని చెప్పింది . తోడేలు "నేను రేపు అలాగే ఆ గొయ్యి వద్దకు వస్తాను. కాకపోతే నన్ను మాత్రం ఆ గోతిలో తోయకు "అని అంది. కుక్క సరేనంది .

ఆ తెల్లవారి తోడేలు కుక్కకు ఇచ్చిన మాట ప్రకారం ఆ లోతైన గొయ్యి వద్దకు వచ్చింది. అది గోతి ముందు రెండు కాళ్లపై నిలబడింది. వెనుక నుండి వచ్చిన నక్క ఆ తోడేలు పై ఆ త్రాడును విసిరింది. తోడేలు వెంటనే కుక్క సైగతో ముందరికి టక్కున జరిగింది. నక్క అది చూడకుండా ఆ త్రాడుతో గట్టిగా వెనుకకు లాగింది. ఆ ఊపుకు నక్క ముందుకు ఉరికి ఆ గోతిలో పడింది. తోడేలు ,కుక్క ఎంతో సంతోషించి" నక్క బావా! నీవు తీసిన గోతిలో మమ్ము పడవేయాలని చూసావు .కానీ నీవే పడ్డావు .ఇంకా నీ చెడు బుద్ధి పోనిచ్చుకున్నావు కాదు. ఇలాగే ఇందులో ఉండు "అని నవ్వాయి.

అప్పుడు నక్క "అయ్యో! నన్ను కాపాడండి. కాపాడండి.నేను మీకు లేనిపోనివి కల్పించి చెప్పి మిమ్మల్ని విడదీసి మీకు చాలా అపకారం చేశాను. మరి ఎప్పుడు ఇలా చేయను" అని బ్రతిమాలింది. వెంటనే కుక్క అక్కడ ఉన్న ఒక కర్రను తీసుకొని వచ్చి ఆ గోతిలో వేసి తోడేలు సాయంతో దానిని పైకి లాగింది. నక్క గొయ్యి బయటకు వచ్చి వాటికి ముఖం చూపించలేక అక్కడ నుంచి వెళ్ళిపోయింది .అవి రెండు అప్పటి నుంచి మంచి స్నేహాన్ని విడదీసే వారి పట్ల చాలా జాగ్రత్తగా మసులు కోవాలని అనుకున్నాయి.



–సంగనభట్ల చిన్న
రామకిష్టయ్య,
9908554535

## రెండు తలల మనిషి (కథ)

ఒక ఊరిలో రెండు తలల మనిషి ఉన్నాడు..అతనికి రెండు తలలు ఉండేవి.కాని కడుపు మాత్రం ఒక్కటే ఉంది. ఒకరోజు మొదటి తల ఒక పండు తింటూ ఇలా అంది " ఈ పండు చాలా రుచిగా ఉంది" అప్పుడు రెండో తల ఇలా అంది "నాకు కూడా ఈ పండు రుచి చూపించవచ్చు కదా"

"ఎవరు తిన్నా ఒకటే కడుపులోనికి కదా" అని మొదటి తల అంది. రెండో తల ఏమి మాట్లాడలేదు.మరో రోజు రెండో తల ఒక పండు తెచ్చుకుంది.అది కూడా మొదటి తల లాగే చేసింది.అలా కొన్ని రోజులు గడిచాయి.ఒకరోజు మొదటి తల రెండో తల మీద పగ. తీర్చుకోవాలి అనుకుంది.అప్పుడు తన మిత్రుడిని పిలిచి రెండో తల పై పగ తీర్చుకోవాలి అని చెబుతుంది.

ఆ మిత్రుడు ఒక విషపు పండు తీసుకొచ్చి మొదటి తల కిచ్చి విషయం చెబుతాడు..మొదటితల రెండో తల కు పండు ఇచ్చి తినమని చెబుతుంది. రెండో తల పండు తినగానే చనిపోతుంది. కడుపు కూడా ఒకటే కాబట్టి మొదటి తల కూడా చనిపోతుంది.



–మల్లు గారి రేష్మ
10వ,తరగతి
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
జక్కాపూర్, సిద్దిపేట జిల్లా
9959007914

## గుళిక

సహజంగా ఆమె విష గుళిక
సమాజంలో విషముష్టి ఫలమొలక
ఆమె నిలువెల్లా అలంకారమే
అంతరంగము నిండా అహంకారమే.

అందానికి అనురాగానికి
పరువాల సోయగానికి
మగవాళ్ళంతా దాసోహమే
మానసాలలో మాత్రం వ్యామోహమే.

ఆమెలో ఆకర్షణ శక్తి ఉంది
ఆమెలో మోహాసక్తి ఉంది
అనుకువతో పలుకరిస్తుంది
అమృతాన్ని చిలకరిస్తుంది.

మీకు ఎక్కడనైనా తటస్థిస్తే
మీరు తటస్థంగానే ఉండండి
తప్పనిసరి పరిస్థితిలో.....
పక్కకు తప్పుకోండి !
మీరు ప్రేమ గోతిలో పడిపోతారు
చివరకు చిప్పను చేతపడుతారు.



– రస స్రవంతి –9290215858
కావ్యసుధ – 9247313488

## ఆనందమేది

గాజు మందిరం, అందంగా ఉంది
ఎన్ని మెరుపులో దాని వొంట్లోబి
సూర్యకిరణాలు చేరగానే అతి పెద్ద వజ్రంలా
అగుపిస్తోంది,మైమరిపిస్తోంది
ఎవరు నిర్మించారోబి
కళ్లతో చూడ్డానికి మినహా
కాపురం చేయడానికి వీల్లేదుబి
ఆకతాయి ఆవేశాల విధ్వంసక వ్యూహాలకి
భీభత్స సృష్టికి బాగా స్పందిస్తుందిబి
ఎంత గొప్పగా ఉందో
ఎంత మనోహరంగా ఉందో
గడపలు కిటికీలు తలుపులు అన్నీ
ఆఖరికి ఫ్లోరింగ్ కూడ గాజుపలకలేబి
అద్భుతమే తప్ప ఆనందమేముంది
కితాబులెన్నొచ్చినా ప్రకృతి విరుద్ధంబి
గాజు మందిరం శోభించడానికి
దాని ప్రాంగణంలో కనీసం
రెండు పూల కుండీలైనా పెట్టండి



–కోటం చంద్రశేఖర్
9492043348

## తెలుగు గజల్

చెట్లు తొందరపడితే..వసంతం వస్తుందా!
మెట్లు ఎక్కకుండానే..శిఖరం అందుతుందా!

ప్రాణవాయువు అందించే..చెట్లకు మొక్కుదాం
ప్రాణవాయువే లేకుంటే..ప్రాణం నిలుస్తుందా!

కలలలో తేలిపోతూ..కాలాన్ని వృధా చేయకు
కనులు మూసుకుంటే..వాస్తవం దాగుతుందా!

గట్టునవుండి భయపడితే..చేరలేవు ఆతీరం
ప్రయత్నమే చేయకుండా..ఫలితం వరిస్తుందా!

ప్లాస్టికు పూలపైన..పన్నీరును ఎంతచిలికినా
ఒదేవా ఆపూలకు..పరిమళం అబ్బుతుందా!

– బూర దేవానందం
8143589789

## సంధ్య సయోధ్య

మన మనసుల్ని
విద్వేషపు శిశిరాలు
ఆవహించి
ఆనందాల పూల దరహాసాల్ని
దహించకముందే
మన ఆశయాల ఆమనులతో
సౌభ్రాతృత్వపు పచ్చదనాన్ని
పరచుకుందాం...
మన మధ్య దురాలోచనల ఆవిర్లు
అల్పపీడనంగా మారి
విధ్వంసపు తుఫానును
సృష్టించకముందే
మన సంకల్ప పవనాలతో
అలజడుల మబ్బుల్ని
తొలగించుకుందాం...
మన మధ్య ఒక లక్ష్యం
కన్నీరు తుడిచే
వెన్నెల తేటై
ప్రవహించాలి...
మన మధ్య
ఒక సామరస్య రుతువు
తొలకరి మేఘమై
వర్షించాలి...
మన హృదయోద్యానాలు
వసుధైక పరిమళాలతో
నిండిపోవాలి...
మన మధ్య
కోటికాంతుల రేపటి ఆశలతో
సంధ్య సయోధ్య
వుదయించాలి...



– డాక్టర్ కొత్వాలు అమరేంద్ర
9177732414

# అవగాహనతో అల్జీమర్స్ అదుపు

ప్రపంచమానవాళిని పీడిస్తున్న అనారోగ్య సమస్యల్లో అల్జీమర్స్ వ్యాధి వైద్య శాస్త్రానికి గొప్ప సవాల్ గా పరిణమించింది.

పరిణమించింది .అల్జీమర్స్ వ్యాధి గురై అనేక మందిమృత్యువాత పడుతున్నారు.

అల్జీమర్స్ ఒక న్యూరలోజికల్ డిజార్డర్ 'మరియు మెదడుసంకోచం' బ్రెయిన్ సెల్స్ డై వంటి సమస్యలకు కారణం అవుతుంది. అల్జీమర్స్ వల్ల జ్ఞాపక శక్తి కోల్పోవడం భాష సమస్య పరిష్కార మరియు ఇతర ఆలోచన సామర్థ్యాలు కోల్పోవడం జరుగుతుంది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇటీవల చేసిన అధ్యయనం ప్రకారం అల్జీమర్స్ వ్యాధి వల్ల అమెరికాలో 7వ మరణానికి దారితీసే వ్యాధిగా గుర్తించి నట్లు అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. 65ఏళ్ల కంటే ఎక్కువ వయసు ఉన్నవారు అల్జీమర్స్ తో చాలా మంది మరణిస్తున్నారు. ఈవ్యాధి వృద్ధులను ఎక్కువగా ప్రభావితం చేస్తుంది.

**ప్రపంచ ఆరోగ్య సంస్థ పరిశోధన**

ప్రకారం ఈ వ్యాధి 30 లేదా 40 యేళ్లలోపు వ్యక్తులను కూడా ప్రభావితం చేస్తుంది. 65 సంవత్సరాలవయసు దాటిన ప్రతి 9మందిలో ఒకరు ఈ వ్యాధికి గురయ్యే అవకాశం ఉందనీ అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. కేవలం వృద్ధులకు మాత్రమే పరిమితమైంది కాదు. 40 బి 50 ఏళ్ల మధ్య వయసు వున్న వ్యక్తుల్లో కూడా అల్జీమర్స్ కనిపిస్తుంది. మధ్య వయసు వారిలో కనిపించే దానిని మతిమరుపు. గానో లేక ఒత్తిడి గానో మానసిక కుంగుబాటుగానో గుర్తిస్తున్నారు.

మహిళల్లో మోనోపాజ్ వంటి లక్షణాలతో బావిస్తున్నారు.

వయసు పై బడిన వారికి జ్ఞాపక శక్తి తగ్గడం. ఈవ్యాధి ముదిరితే ఆలోచించడం 'తినటం మాట్లాడటం 'వ్యక్తి సాధారణ సహజ సామర్థ్యాలను కోల్పోతారు.

వయసుపై బడిన వారిలో కొందరి లో అనివార్యంగా వస్తున్న వ్యాధి అల్జీమర్స్.

ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 21 న 'ప్రపంచ అల్జీమర్స్ డే'ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వహిస్తుంది

అల్జీమర్స్ వ్యాధికి కారణాలు లక్షణాలు వాటి తీవ్రత పట్ల అవగాహన కల్పించి అల్జీమర్స్ వ్యాధిని అదుపులో వుంచడానికి సదస్సులు సమావేశాలు నిర్వహించి చైతన్యం కలిగిస్తుంది.

అల్జీమర్స్ వ్యాధిని మొదటి సారి1906 లోజర్మన్ సైక్యాట్రిస్ట్ నూరోపతలోజిస్ట్ డాక్టర్ అల్జీమర్స్ వ్యాధినీ కనుగొన్నారు.

అసాధారణ మానసిక వ్యాధి తో మరణించిన మహిళా మెదడు కణజాలంలో మార్పులను గమనించడం జరిగింది. 2012 లో మొదటి సారి ప్రపంచ అల్జీమర్స్ డే నిర్వహించబడింది. వాస్తవానికి సెప్టెంబర్ మాసాన్ని అల్జీమర్స్ మాసంగా పిలుస్తారు. అల్జీమర్స్ వ్యాధికి చికిత్స లేదు తాత్కాలికంగా వ్యాధి తీవ్రతను లక్షణాలను తగ్గించే ఔషదాలు అందుబాటులో ఉన్నాయి అల్జీమర్స్ రోజున అల్జీమర్స్ అసోసియేషన్ ప్రపంచ వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తుంది.

**అల్జీమర్స్ అదుపు:** అల్జీమర్స్ వ్యాధిని ప్రారంభములో గుర్తించి మందులు వాడాలి. కుటుంబ సభ్యులు సహకారం వల్ల అల్జీమర్స్ వ్యాధి పెరగటాన్ని జీవన నాణ్యత దిగజారిపోవటాన్ని అదుపుచేయ వచ్చు.

విటమిన్స్ బి, సి 'ఇ ఫోలేట్ వంటి తోసప్లిమెంట్స్ తీసుకోవడం ద్వారా అల్జీమర్స్ వ్యాధి రాకుండా జాగ్రత్త పడాలి. పోషకాలతో కూడిన సప్లమెంట్లు ఫలాలు ఆహారం వృద్ధులకు ఇవ్వడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉంచవచ్చు.

సప్లిమెంట్స్ వాడకం ద్వారా అల్జీమర్స్‌ను నిరోధించడం సాధ్యం కాదు కానీ దాని తీవ్రతను తగ్గించ వచ్చు.

సులభమైన వ్యాయామాలు. టంగ్ ఎక్సర్సైజ్ బ్రెయిన్ ఆక్టివేట్ ఎక్సర్సైజ్ చేయడం ద్వారా అల్జీమర్స్ రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి.

అల్జీమర్స్ వ్యాధిపై చైతన్యం పెరిగింది.

ఆధునిక కాలములో ఎక్కువ మందికి రావడముతో ఆధునిక కాలములో దీనికి చికిత్స అందుబాటులోకి రాలేదు .

టంగ్ ఎక్సర్సైజ్ 'బ్రెయిన్ ఆకిప్వేటింగ్' ఎక్సర్సజ్ లాంటి "చిట్కా చికిత్సలు" ప్రచారములో వున్నాయి. టంగ్ ఎక్సర్సైజ్ వల్లఅల్జీమర్స్ రాకుండా జాగ్రత్త పడడం అంతే కాకుండా ఒక వేల వ్యాధి వచ్చిన ముదరకుండ అదుపుచేయవచ్చు.వ్యక్తి ఉదయం లేవగానే అద్దం ముందు నిలబడి నాలుకను నోటి నుంచి బయటకు పెట్టి కుడి వైపుకు ఎడమ వైపుకు సాగదియ్యాలి. రోజు కనీసం 10 సార్లు చేస్తే మెదడులోని ప్రధాన భాగాలు ప్రేరేపితమై అల్జీమర్స్ రాకుండా వుంటుందని ఒక అంచనా. గుంజీలు ( బస్కిలు) తీయటం మెదడు చైతన్య వంత మైన వ్యక్తి మేధస్సు మెరుగు పడుతుంది.

క్రమం తప్పకుండ వ్యాయామం చేయటం సంతులిత ఆహారం 'శరీర బరువును తగ్గించుకోవడం దూమపానానికి 'మద్యపానానికి దూరంగా వుండడం ఆరోగ్యకరమైన జీవన విధానం మెదడును ఆరోగ్యంగ వుంచడానికి దోహదపడుతుంది. చెక్కర వ్యాధి బిపి అదుపులో ఉంచుకోవడం.

చురుకైన సామాజిక సంబంధాలు కొనసాగించడం వల్ల మెదడులోని నాడికణాల మధ్యసంభందాలు బలపడి మెదడు చురుకుగా పనిచేస్తుంది. ఇది వ్యక్తి ఆలోచన శక్తి దెబ్బతినకుండ ఉండడానికి దోహద పడతుంది. పౌరసమాజం వైద్యులు ఆరోగ్య శాఖ స్వచ్ఛంద సంస్థలు సామాజిక సాంస్కృతిక సంస్థలు ప్రసార సాధనాలు ఎలక్ట్రానిక్ మీడి యా సోషల్ మీడియా అల్జీమర్స్ వ్యాధిని అదుపులో వుంచడానికి ఆరోగ్యకర జీవన విధానం మెరుగైన ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పునరుద్ధరణ ఆందోళన రహిత మెరుగైన సామాజిక సంబంధాల బలోపేతంతో అహల్లా ధకర సమాజ నిర్మాణంతోఅల్జీమర్స్ వ్యాధి రహిత సమాజ స్థాపనకు పునరంకితం కావాలి.

( ప్రపంచ అల్జీమర్స్ దే సందర్భంగా)

–నేదునూరి కనకయ్య
9440245771

## అవగాహన చేసుకో..?

సమస్యలు చేధించనోడు
పరిష్కారం చూపించలేడు
భారము అనుకున్నవాడు
సంసారము ఈదలేడు.

నిజం చెప్పలేనోడు
నిజాయితీగా వుండలేడు
భుజం తట్టిలేపనోడు
సాయాన్ని అందించలేడు

అసత్యం పలుకువాడు
సత్యాన్ని మోయలేడు
పత్యం వున్నవాడు
పరమభక్తుడు కాలేడు.

కష్టమన్నది ఎరగనివాడు
భ్రష్టుపట్టి పోవునతడు
ఇష్టమన్నది లేనివాడు
నష్టానికి లోనవుతుండు.

చదువు లేనివాడు
వెధవలా తయారవుతుండు
విద్య కల్గినవాడు
వైద్యములా పనిచేస్తుండు.

ప్రజల గోడు పట్టనోడు
పాలకుడు కాబోడు
జనుల జాగృతం చేయనోడు
నాయకుడు కాలేడు



–పసుల.శంకర్
9542181301

## ఆ రాగమెలా నడిపిస్తుంది ?

ఎన్నిసార్లు చెప్పినా
కోయిల నిన్నటి రాగమే పాడుతోంది
ఇది శిశిరానికి వెక్కిరింపో !
వసంతానికి పలకరింపో !!

ఎక్కడినుంచి వచ్చిందో
దేన్ని సరిచేద్దామని గొంతువిప్పిందోగాని
ఎంత వద్దన్నా
నిన్నటి రాగమే పాడుతోంది.

సర్లే ...ఏ రాగమైతేనేం
రాగానికి పాతేమిటి ? కొత్తేమిటి ?
నువ్వెంచుకున్నరాగం
ఎన్ని హృదయాలను కదిలించింది
నువ్వాలపించిన గీతం
ఎన్ని ప్రశ్నలను మొలకెత్తించింది
నువ్వెత్తుకున్న పాట
ఎందరి మెదళ్ళను మెలిపెట్టిందన్నదే ప్రశ్న

అయినా...తడిలేని రాగం
మనసునెలా పులకింపజేస్తుంది ?
ఏ భావనాలేని రాగం
ప్రశ్నలనెలా మొలకెత్తిస్తుంది ?
ఏ అర్థంలేని రాగం
ఆలోచనలనెలా రగిలిస్తుంది ?
చలింపజేయని రాగం
ఆశల వసంతాలనెలా
పులుముతుంది ?
ఆత్మచైతన్యంలేని రాగం
నిస్తేజంగావున్న సమాజాన్ని
కొత్తవెలుగువైపెలా నడిపిస్తుంది ?



- ఎన్.నరేశ్ చారి
9701334516

## నటసాహస శిఖరం



తేనెమనసులతో
తెలుగు చిత్రసీమలో
అరంగ్రేటం చేసిన డేరింగ్ డాషింగు
సంచలనాల సాహసమూర్తి
ఘట్టమనేని వంశాబ్ది శశుడు
శివరామ కృష్ణమూర్తి.

విభిన్న పాత్రల విలక్షణతను చాటి
గూడచారి 116గా
గూడుపుటాణిలో
తెలుగు సినీ వినీలాకాశంలో
తనదైన శైలిలో
వస్తాడు నా రాజు ఈరోజు గానంలో
"అల్లూరి సీతారామరాజు"గా
మరపురాని నటనా కౌశలం
70 ఎఎ సినిమాకు
ఆజ్యం పోసిన బుర్రిపాలెం బుల్లోడు
సింహాసనం, అడవిసింహాలు,ఈనాడు
మోసగాళ్లకు మోసగాడు,
దేవుడు చేసిన మనుషులు,
ముందడుగు,
ఒసేయ్ రాములమ్మా
పీపుల్స్ ఎన్కౌంటర్
దేవదాసు మళ్లీ పుట్టాడు,
పండంటి కాపురం లాంటి వందల
చిత్రాల నిర్మాత దర్శకులకు
ధైర్య రసాన్ని నింపిన
కౌబాయ్ చిత్రాల కథానాయకుడు
"నవ్వుతూ బతకాలిరా" అంటూ
మాయదారి మల్లిగాడై
నిరంతరం చిరుదర హాసంతో
అభిమానులను
సినిమా యూనిటుసభ్యుల్ని టెక్నీషియన్లను
నోటి నిండా పలుకరిస్తూ
బతుకుల వెలుగులు దిద్దిన
పద్మాలయ స్టూడియోస్ అధినేత..!.

తరలిరాని లోకాలకెళ్ళిన
సాహస శిఖామణిని తలచుకుంటూ
అభిమానులు అశ్రునయనాల
హారతలందిస్తూ
దుఃఖాన్ని కనులకొనలనీరుగా
బరువెక్కి వెచ్చ వెచ్చగా
వగపుగా జారుతున్న వ్యథలు
విలవిల్లాడుతున్నాయి మనోవ్యథలు....!
మా సూపర్ స్టార్
మా కౌబాయ్ లేడని
సాహసయోధుడు
సంస్కరణల మేధావిని తలచుతు
శోకసంద్రంలో మునిగితేలుతూ...!
తెలుగునాట అభిమానులు
నటశేఖరుని మరణవార్త
నిజం కాదని...!
ఓ చిత్రంలో సన్నివేశం కావొచ్చేమోననీ
భ్రమలోనే ఉన్నారింకానూ...!
పుట్టినవాడు గిట్టకతప్పదని
పెద్దలుచెబుతూ
ఓదార్చేవరకు
తెలియలేదు...!



–డా.పాండాల మహేశ్వర్
9912180054



# సమాజాన్ని ప్రక్షాళన గావించే కవిత్వం "మట్టిపాదం"






"పువ్వులోని సువాసన, మనిషిలోని ప్రతిభను ఎంత దాచినను దాగవు" అన్నారు జవహర్‌లాల్ నెహ్రూగారు. అలాంటి "ప్రతిభ" కవయిత్రి సొంతమైతే ఆ కవిత్వం ప్రేరణ కల్పిస్తుంది, స్పందన రేకెత్తిస్తుంది. మనిషి మనసును కదిలిస్తుంది, మనసులోని మలినాలను కడిగి మనసు శుభ్రపరుస్తుంది. అలాంటి కోవకు చెందిన కవిత్వమే జి.ఈశ్వరీ భూషణం గారి "మట్టిపాదం" కవితలలో మనకు కనిపిస్తుంది.

జి.ఈశ్వరీ భూషణం గారు పూర్వ ప్రకాశం జిల్లాలోని కందుకూరు సమీపాన శాఖవరం గ్రామంలో సామాన్య కుటుంబంలో లక్ష్మీదేవి, మాలకొండయ్య దంపతులకు ఏడుగురు సంతానంలో నాలుగో సంతానంగా జన్మించారు. భర్త నాగభూషణం గారి అండతో తాత, అమ్మమ్మలు చలువతో కలం కదిలించి కవితా కుసుమాలను పూయించారు.

ఉపాధ్యాయురాలుగా, కవయిత్రిగా, సంఘసేవకురాలుగా బహుముఖ ప్రజ్ఞను కనబరుస్తూ అనేక సామాజిక అంశాలపై గళమెత్తి సమాజాన్ని ప్రక్షాళన గావించాలనే తలంపు నుండి ఉదయించిన అద్భుత కవిత్వమే "మట్టిపాదం" కవితా సంపుటిగా ఆవిష్కృతమైంది.

**"సమాజానికి పుట్టిన, పట్టిన చీడపీడల దోపిడీలను / నీ కలంతో కోరల్ని పీకి... / దూరంగా పారెయ్యి / నీ అక్షరాల సిరాతో నలుదిక్కుల దుర్మార్గపు దోపిడీని కసితీరా కడిగెయ్యి"** అంటూ నిలువు దోపిడీకి గురియవుతున్న మానవ దీన వ్యవస్థకు చరమగీతం పాడుదామని దోపిడీని కసితీరా కడిగేసి రేపటి తరానికి ఆదర్శంగా జీవిద్దామని ఆశాభావాన్ని వ్యక్తపరిచారు.

మంచిని చూసే మనసుంటే ప్రతిమలు సైతం స్నేహసుధలు పూస్తాయి అన్నట్లు తన "మట్టిపాదం" అనే కవితలో మట్టియొక్క గొప్ప తనాన్ని ఊటంకిస్తూ కవిత్వానికే ప్రాణం పోసింది.

**'నెర్రెలు బారిన నేలను నాగేటితో దున్నుతూ / కొనదేలిన కొయ్యగుచ్చినప్పుడు / రుధిరధారలు జాలువారినా / సిరులు పండించి చరిత్రకు దారులేసిన మట్టిపాదాన్ని"** అంటూ రైతు శ్రమను సజీవంగా చూపడానికి ఆమె పడిన తపన, ఆవేదన ఈ కవితలో దర్శనమిస్తుంది.

'మానవత్వమే మతం' అనే కవితలో **"స్వార్థం ఎరుగని జీవనదులు / స్వలాభం తలవని మూగజీవులు / వృక్షజాతి, పక్షజాతి సమస్త జీవులకు లేని మతం మనిషికెందుకని?"** మత మారణహోమాలను ప్రశ్నించింది. మతం ముసుగులో బలియవుతున్న అమాయకుల అరణ్య రోదనలను కళ్ళకు కట్టింది. మత ముసుగులో జరుగుతున్న వికృత క్రీడలను ఎండగట్టింది. సాంఘిక దురాచారాలపై గళమెత్తిన తీరు 'నభూతో నభవిష్యతి'గా చెప్పవచ్చు.

రంగు దారాలతో సొబగులు అద్దిన సాలెగూడు / రంగు వెలిసి చిమ్మ చీకటిలో వెలుతురు కోసం పెనుగులాడుతోంది... అని అంటారు ఒక కవితలో చేనేత బ్రతుకుల్లోని కష్టాలను కళ్ళముందు సాక్షాత్కరింప జేసే ప్రయత్నం జేసారు పై కవితలో. రంగుల ప్రపంచంలో చేనేత బ్రతుకు పూదోట కావాలని ఆకాంక్షించారు.

జీవించడానికి సగటు మనిషి కొనసాగిస్తున్న పోరాటాన్ని కళ్ళకు కట్టినట్లు తెలిపారు "జీవన పోరాటం" అనే కవితలో

**"అంతరంగంలో భావాలు అల్లకల్లోలం అవుతుంటే**
**మనసు రెక్కల్ని అదుపు చేసుకుంటూ**
**బిక్కుబిక్కుమంటూ బ్రతుకు పోరాటంలో**
**గెలవడానికి తపన పడుతున్నా"**

నంటూ సగటు జీవుల బతుకు పోరాటాన్ని కళ్ళముందు ఆవిష్కరించే ప్రయత్నం చేశారు.

ప్రజాహితం కోరి సమాజంలోని సమస్యలను ఏకరువు పెట్టారు కవయిత్రి. జి.ఈశ్వరీ భూషణం గారు. బాలకార్మిక వ్యవస్థ, స్త్రీల సమస్యలు, అన్నదాత ఆకలికేకలు, సమాజ సమస్యలపై కలం సాగించిన తీరు అమోఘం అనిర్వచనీయం అని చెప్పవచ్చు.

కవిత్వమును సమాజంలో సజీవంగా ఉంచడానికి ఆమె మహాయజ్ఞమే చేసింది ఈ "మట్టిపాదం" కవిత్వంలో. ఆమె పేరులోని భూషణాలను కవితలకు ఆపాదించి కవిత్వానికే ప్రాణం పోసింది. మానవ సమాజంలో మనిషి మోడుబారిన ప్రతిసారి కవిత్వం మధుమాసమై వచ్చి మనస్సును చిగురింపజేసినట్లు ఆమె కవిత్వం మనల్ని చిగురింపజేస్తుంది.

ఈ పుస్తకంలో 100 పేజీలలో 60 కవితలున్నాయి. ప్రతి ఒక్క కవిత మనసును కదిలించేదే. ఈ పుస్తకాన్ని అన్నయ్య గద్దం మాల్యాద్రిగారికి అంకితమిచ్చింది. శ్రీశ్రీ కళావేదిక ద్వారా దీనిని ప్రచురించారు. ముఖచిత్రంతో సహా పుస్తకమంతా తీర్చిదిద్దినట్లుగా బాగుంది. కందుకూరు శాసనసభ్యులు మానుగంట మహీధర్‌రెడ్డి, ప్రజాకవి, వాగ్గేయకారులు గోరేటి వెంకన్న, శ్రీ శ్రీ కళావేదిక ఛైర్మన్ డా.కత్తిమండ ప్రతాప్, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి తదితరులు తమ ముందుమాటల్లో జీ.ఈశ్వరీ భూషణంగారి కవిత్వం చక్కగా ఉందంటూ ఆశీర్వదించారు.

ఆమె తొలి ప్రయత్నంలోనే పాఠకుల హృదయాలను హత్తుకొనేలా కవిత్వాన్నీ రాయడంలో నఖశిఖపర్యంతులై నారనడంలో సందేహం లేదు. ఏది ఏమైనా "మట్టిపాదం" కవిత్వం ప్రతి ఒక్కరూ చదువదగిన సామాజిక స్పృహ కలిగిన కవితా సంపుటి. అనుభవాల కొలిమిలో కాగి అవగాహన బలిమితో కవిత్వమై సాగిన జి.ఈశ్వరీ భూషణం గారు మున్ముందు మరింత వాడియైన కవిత్వాన్ని వండి వార్చాలని మనసారా ఆశిద్దాం!...



–పిల్లి.హజరత్తయ్య,
9848606573

## కాలమా ఏదీ మా దారి?

మారుతున్న మనుషులు,
మారుతున్న పరిణామాలు..
ఈ మాయ ప్రపంచంలో
నిరంతరంగా ప్రవహించేది నీవు..

గడచిన కాలమా..
నీవింకా ఎప్పటికీతిరిగిరావు,
జ్ఞాపకాల దొంతరలు తప్ప..
మాకంటూ మిగిలింది ఏమియునూ లేదు!

ఈ ఒడిదుడుకుల
జీవితంలో
ఓటమి గెలుపుల
సయ్యాట మాది,
నిరంతర ప్రవాహంలా
ఆగని జలపాతంలాంటి
రహదారి నీది!.

ఆశ నిరాశల మధ్య సాగిపోయే
జీవితం మాది..
అడ్డు కట్ట అంటూ లేని
కదిలే ప్రవాహం నీది!

మొన్నటిలా.. నిన్న లేదు,
నిన్నటిలా.. నేడు లేదు,
రేపటికి.. రూపం లేదు,
మును ముందు..
ఏమవుతుందో తెలియదు.

ఈ మాయా మాయ జగత్తులో
మాయని గాయలెన్నో..ఎప్పుడూ,
ఈ జీవన పయనంలో..
సంతృప్తి అన్నదే లేదెప్పుడూ!

ఇక ఈ జీవితాలకు
అర్థం తెలిసేది ఎన్నడూ?
జీవితపు పరమార్థం
గోచరించేది ఎన్నడూ?
ఈ జీవితాలకు సార్థకత వచ్చేదెన్నడు?
జీవితం ప్రశాంతం అయ్యేదెన్నడు??

ఓ నిరంతర ప్రవాహమా.,
ఏదీ మా దారి?
ఓ పయనించే ప్రవాహమా.,
మేము ఎటువైపు
పోయేది..??
ఓ కాల ప్రవాహమా..!
మాకు బదులు తెలుపుమా..!!



-ఎన్.. రాజేష్
9849335757

## బ్రతికి యుండిన శుభములు..

సమస్యలు అలలు
మనిషిని ఊపిరాడకుండా
ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే
ఆటుపోట్లును తట్టుకోలేక
జీవన యానమును
అర్థాంతరంగా ముగిస్తున్నాడు

నేతిబీర చదువుల్లో
ర్యాంకుల వెర్రి నెత్తికెక్కి
బాల్యాన్ని చిదిమేస్తుంటే
బాధను పంచుకునే వారు లేక
బలహీన క్షణాలను అధిగమించలేక
ఆత్మహత్యలను ఆశ్రయిస్తున్నాడు.

కష్టాల సేద్యం కలిసిరాక
అప్పుల ఊబిలో చిక్కుకుని
బయటకొచ్చే దారి తెలియక
నిరాశ కోరల్లో చిక్కుకొని
నిస్పృహ జ్వాలలకు
బలియై పోతున్నాడు

దీప దేహము
తానంతట అదే
కొండెక్కాలి తప్పా
బలవంతంగా
అర్పాలనుకోవడం
ఏ రకంగా చూసినా
శ్రేయోదాయకం కాదు.

వెలుగు నీడల జీవితంలో
సీత కష్టాలు సీతవి
పీత కష్టాలు పీతవి కావున
కష్టాల జడివానను
ఆత్మవిశ్వాస గొడుగుతో అధిగమించి
బ్రతికి యుండిన శుభమే కదా.!



-పిల్లి హజరత్తయ్య,
9848606573

## జలం-జీవం

సకల జీవరాశికి జీవనాధారం జలం
కానీ నేలంతా జలమయమైతే కష్టం, నష్టం
నీరులేక పంటపొలాలు బీటలు బారడం సహజం
నీటి ముంపుతో పంటలన్నీ పాడవడం అతి సహజం
నీరులేని జీవితం కల్మషాల మయం
కలుషిత నీటితో జీవనం రోగాల మయం
నీటితో మనిషికి ఎడతెగని అనుబంధం
పుట్టిన బిడ్డ నీళ్ళు చల్లగానే కెవ్వుమంటుంది
పెరిగిన బిడ్డ నీళ్ళల్లో చేపలా ఈదడం నేర్చుకుంటుంది
ఆహారమే లేనినాడు నీళ్ళతోనే కడుపు నిండుతుంది
నీరు లేకుంటే దాహార్తితో మరణమే సంభవిస్తుంది
నీరు లేకుంటే అంత్యేష్టికి అవరోధం ఏర్పడుతుంది
గంగ లేకుంటే గౌరీపతి కైనా గొంతు మండుతుంది!



-యం. బాల గంగాధరయ్య
9849546762

## మందు

కాలం మారినా
కట్న పిశాచి వదలదే !
మనిషి విజ్ఞానం పెరుగుతున్నా
ఈ వ్యాధికి మందు కనిపెట్టదే!



-యలమర్తి అనూరాధ
9247260206

## అలలై గెలవాలి..!!

అలుపన్నది రానేరాదు ఆ అలలకు..
పరుగులు ఆపవు తీరం చేరేవరకూ !!

ఎన్నిసార్లు పడినా తరగదు ఉత్సాహం..
ఆకాశం అందుకోవాలనే ఆ ఉద్వేగం !!

సుడిగుండాలలో మొదలయ్యే పయనం..
ఎదురుగాలులు వీస్తున్నా వెరవని వైనం !!



-పేరిశెట్టి బాబు
9247170800

# మేక ఏడ్చింది

(కథ)

రాజేష్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. కానీ రోజూ బడికి పోకుండా తోటల్లో దూరి సిగరెట్లు తాగడం, పేకాటలాడడం చేస్తుంటాడు.

తండ్రి వెంకటేశం పొలం పని చేసుకుంటూ పిల్లవాడ్ని చదివిస్తున్నాడు. భార్య, కూతురు ఇంట్లో గేదెలను, మేకలను పెట్టుకొని పాల వ్యాపారం చేస్తున్నారు. ఒక్కగానొక్క కొడుకని రాజేష్ ను బడికి పంపి చదివిస్తున్నాడు కూతుర్ని ఐదవ తరగతి దాకా చదివించి ఇంట్లోనే ఉండమన్నాడు. ఇంట్లో గేదెలు, ఆవులు, మేకలు ఉన్నాయి. వాటికీ మేత తేవడం, గడ్డి వెయ్యడం, తవుడు కలపడం కోష్టం చిమ్మడం ఎన్నో పనులుంటాయి. భార్య ఒక్కతే ఇన్ని పనులు చేయలేక అవస్థ పడుతోందని కూతురు రవళిని బడి మానిపించాడు. కొడుకును బాగా చదివిస్తే కుటుంబాన్నంత పోషిస్తాడని వెంకటేశం ఆలోచించాడు.

రాజేష్‌కు ఇవన్ని అర్థం కావు. బడికి అని చెప్పి సంచీ వేసుకుని బయల్దేరతాడు. సగం రోజులు బయటనే గడిపేస్తాడు. చదువుకుంటున్నాడని తండ్రి రోజూ రాజేష్ కు ఎంతో కొంత డబ్బులిస్తాడు. తండ్రి కష్టం, తల్లి బాధ, చెల్లెలు త్యాగం రాజేష్ కు అర్థం కావు.

భార్య మంగ, కూతురు రవళి మూగ జీవుల్ని ఎంతో ప్రేమగా చూసుకుంటారు. తమ బాధల్ని ఆ జంతువులతోనే మొరపెట్టుకుంటారు. వీరి బాధల్ని విన్న జంతువులు మూగగా రోదిస్తుంటాయి. వీళ్ళ సంతోషాల్నిఆనందంగా పంచుకుంటాయి. ఆనందం ఎక్కువైతే మెడలో మువ్వలు కదిలుస్తూ తలలు ఊపుతూ కల్లు కదిలిస్తాయి. ఆ మూగ జీవాలన్నీ కుటుంబ సభ్యుల్లానే ప్రవర్తిస్తాయి.

రాజేష్ ఊరి బయట పేకడుతున్నాడు. ఆ రోజు ఇచ్చిన డబ్బులు అయిపోయాయి. అయినా అప్పు పెట్టి ఆడుతున్నాడు. రెండు వేలు అప్పు పడ్డాడు. స్నేహితులు అప్పు డబ్బులు ఇప్పుడే ఇవ్వాలని పట్టు బట్టారు. రాజేష్ కు ఏం చేయాలో తోచలేదు.

మెల్లగా ఇంటికి వెళ్ళాడు. తల్లి, చెల్లి వంటపనిలో ఉన్నారు. దొడ్లోకి వెళ్ళి ఒక మేకను తాడు విప్పుకున్నాడు. తనతో తీసుకెళ్ళాడు సంతకు తోలుకెళ్ళి బేరం పెట్టాడు.

మటన్ కొట్టు సాయిబు వచ్చి బలిష్టంగా ఉన్న మేకను చూసి ముచ్చట పడ్డాడు. మేకను బేరమాడి కొనుక్కున్నాడు. రాజేష్ కు డబ్బులిచ్చాడు. చాలా మాంసం వస్తుందని మనసులో లేక్కలేసుకుంటున్నాడు. రాజేష్ మేకను సాయిబుకు అప్పజెప్పాడు. మేక మనసులో బాధపడుతున్నది.

చిన్నప్పటి నుంచి రాజేష్ ను చూస్తున్నది. వాడు తగిన పాలన్నీ తనతో పాటు వాళ్ళింట్లో నివసించే అవులవే. వాళ్ళమ్మ పాలు సరిపోకపోతే రోజూ ఆవు పాలే పట్టే వాళ్ళు. ఒకసారి బాగా జబ్బు చేసి సన్నగా అయిపోయాడు అప్పుడు మేక పాలు తాగించమని ఊర్లో శాస్త్రులు గారు చెపితే తన పాలే తాగాడు. రాజేష్ చిన్నతనం నుంచే మంకు పట్టు పట్టేశాడు. ఎప్పుడూ తల్లి మాట వినేవాడే కాదు.

తన పాలు తాగాడు కాబట్టి మేక కూడా తన బిడ్డలాగే అనుకుంటుంది. రాజేష్ తనను అమ్మేసినా కోపం రాలేదు. ఎలా బతుకుతాడో ఏమో అనే బాధ తన్నుకోస్తోంది మేకలో. రాజేష్ డబ్బులు లెక్క బెట్టుకుంటున్నాడు. ఇక రాజేష్ ను చూడటం వీలు కాదనే ఆలోచన రాగానే మేకకు దిగులు కమ్మేసింది.

మేక ఒక్కసారిగా సాయిబు చేతి నుంచి తప్పించుకొని రాజేష్ వద్దకు వచ్చింది. రాజేష్ కు మేకను చూసే తీరిక లేదు. మేక మనసు అర్థం చూసుకోలేదు. మేకకు దుఃఖం ఒక్కసారిగా కట్టలు తెంచుకున్నది. రాజేష్ భుజం మీద రెండు కాళ్ళు వేసి ముఖాన్ని ముద్దు పెట్టుకుంది. ఇంకా ఆపుకోలేక మేక భోరున ఏడ్చింది. ఆ మార్కట్లో ఉన్న జనం అందరూ రాజేష్ వంక చూడ సాగారు. రాజేష్ డబ్బు మత్తుతో ఉన్నాడు.

మేకకు రాజేష్ మీద తల్లి ప్రేమ ఉన్నది. రాజేష్ చెడు సావాసాలతో చెడిపోతున్నాడని భాధగా ఉన్నది. మటన్ కొట్టు సాయిబు తానను చంపేస్తాడనే భయం లేదు దానికి. పిల్లాడి సంగతి వాళ్ళ అమ్మా నాన్నకి చెపితే బాగుండేది అనుకున్నది. అంతలోనే రాజేష్ నాన్న మార్కెట్లో పొలానికి కావాల్సిన మందులు కొనుక్కుంటు కనిపించాడు.

మేక ఇంకా పెద్దగా ఏడ్వడం మొదలు పెట్టింది. జనాలు అందరూ ఆశ్చర్యంగా చూడ సాగారు. వెంకటేశం ఏంటా అని చూడటానికి వచ్చాడు. రాజేష్ నూ మేకనూ చూసి ఆశ్చర్యపోయాడు. మేక అన్ని విషయాలు చెప్పి రాజేష్ ను జాగ్రత్తగా చూసుకోమని చెప్పింది. తను సాయిబు దగ్గరకు వెళ్ళి నిలబడింది. వెంకటేశు సాయిబుకు డబ్బు ఇచ్చేసి మేకను తీసుకున్నాడు. మేకనూ, రాజేష్ నూ ఇంటికి తీసుకెళ్ళాడు. రాజేష్ కు అర్థమయ్యేలా చెప్పాడు. అప్పట్నుంచి రాజేష్ ఏం చేస్తున్నాడో గమనించడం, అవసరమైనపుడు అదిలించడం మొదలు పెట్టాడు. తండ్రి పట్టించుకోవడం మొదలు పెట్టగానే రాజేష్ చెడు స్నేహాలు తగ్గించుకున్నాడు. క్రమక్రమంగా చివరకు చెడు అలవాట్లు మానుకున్నాడు. తల్లీ తండ్రీ కష్టాన్ని అర్థం చేసుకున్నాడు. చక్కగా చదువుకోవటం మొదలు పెట్టాడు. మేక కు మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. రోజూ పొలానికి తీసుకెళ్ళి మేకను మేపి తీసుకు వస్తున్నాడు. ఇప్పుడు మేక సంతోషించింది.



–డా॥కందేపి రాణీప్రసాద్
98661 60378

## ఆమె

సూర్యోదయానికి ముందే నిద్రలేచే పసితనం
క్షుద్బాధ చల్లార్చడానికై చలించే యంత్రం
ఆమె నిరంతరం పరిభ్రమించే భూగోళం
ఆగక పరుగులుపెట్టే నదీమతల్లి
ఆ కురులు చెదిరిన ఎండిన మేఘాలు
తైలసంస్కారం లేని వాడిన గడ్డిపోచలు
ఆకళ్ళు ప్రశ్నల పల్లేరు కాయలు
జీవం లేని ఎడారులు
ఆమె అక్షరం ఎరుగని గుడ్డిచుక్క
ఆ హృదయం వేదనల జలపాతం
ఆ మనసు కెరటాలఘోష
నిద్రలోనూ పాత్రల ధ్వనులు
దుమ్ము,ధూళి తుఫానుల స్వప్నాలు
ఆ గృహం ఎముకలగూడు స్పర్శతో
సింగారించుకుంటుంది
అనారోగ్యం గాలి వీచి
ఆ యంత్రం రాక, ఒక్క రోజు ఆగితే
ఆ ఇల్లు పిచ్చిమొక్కల అరణ్యమే
ఆ మది పృథ్వి కెప్పుడూ ఆత్మీయత 'కరువే'
ఆ లేతచేతుల శ్రమను గుర్తించే చల్లనిస్పర్శకై
జీవితకాలం ఎదురుచూపులు
ఆ నిరీక్షణ ఫలించే రోజెన్నడో?
ఆ హృదయక్షేత్రంలో
ఆత్మీయత విత్తనాలు చల్లుదాం
ఆ పాదాల పరుగుల దారిలో
పాలపుంతలు వెలిగిద్దాం!!



–డి.కె.చదువులబాబు
9440703716

# మూర్ఖుల తెరువుపోవడం మూర్ఖత్వమే




ఒకానొక వనంలో పశు పక్ష్యాదులు నిండైన పచ్చదనంతో పరవసించిపోతున్నాయి. అది చలికాలం ఎముకలు కొరికేంత చలి, ఆ చలిలోనే ఈదురుగాలులతో కూడిన వర్షం. చెట్లు చేమల మీదున్న జీవాలు తడ్సీ ముద్దఅయి చలికి గజగజ వణికిపోతున్నాయి.

ఇలా వణుకుతున్న జీవాల్లో మనిషి పుట్టుక వీటినుండే అని చెప్పబడే మర్కట (కోతి)మూల కూడా ఉంది. ఇవి కూడా తీవ్రమైన చలికి గిలగిల కొట్టుకుంటున్నాయి. చలి తీవ్రతను ఎలా ఎదుర్కోవాలో తోచడం లేదు వాటికి. ఎంతో ఆలోచించగా ఒక యువ మర్కటానికి ఓ ఆలోచన తట్టింది.

తలో ఎండు పుల్లను వెతికి తెచ్చి కుప్పగా పోయాలని, అదిగో తమ కళ్ల ముందరి నుండి గుంపులు గుంపులుగా మిణుకు మిణుకుమంటూ వెళ్తున్న మిణుగురు పురుగుల గుంపును తట్టితెచ్చి ఆ పుల్లలను వెలిగించాలని చెప్పింది. అది చెప్పడమే తరువాయి, మర్కటాలు వెళ్లి నిమిషాల్లో ఎండుపుల్లలు తేవడం, ఆ వెంటనే మిణుగురు పురుగులను దోసిల్లతో తెచ్చి ఆ ఎండు పుల్లలతో వేయడం చేశాయి.

ఆ తర్వాత మంటకోసం కొన్ని నోటితోను మరికొన్ని గొట్టాలతోను ఊదుతూనే ఉన్నాయి. కానీ మంట మాత్రం రావడం లేదు. అవి చేసే ప్రయాసకు అంత చలిలో కూడా వాటికి చెమటలు పట్టేశాయి. అయినా పిల్లలు వెలగం లేదు. ఏం చేయాలో అర్థం కావడం లేదు, చిరాగ్గా తిక్క తిక్కగా ఉంది వాటికి.

అక్కడే చెట్టుపై కూచొని మర్కటాల ప్రయాసను గమనిస్తున్న ఓ పిల్ల కాకి, వాటి అమాయకత్వానికి జాలిపడి చెట్టు మీది నుండి ఆ పిల్లల కుప్పవద్ద కొచ్చి "మర్కట మామయ్యలూ! ఆ మిణుగురు పురుగులు నిప్పురవ్వలు కావు, అవి శ్వాస నిశ్వాసాల వచ్చే వెలుగులు మాత్రమే. మీరెంత సేపు ఊదినా వ్యర్థమే. నిప్పురాదు, ఆ పుల్లలు మండవు".

అలా చెప్పగానే, ఈ కుర్రకాకి మాకు చెప్తుందా అన్న ఆక్రోశంతో బాటు అలసిపోయి చిరాగ్గా ఉన్న మర్కటాలకు కోపమొచ్చి "ఓసీ! పిల్లకాకీ నీవు మాకు బుద్ధి చెప్తావా?" అని దాని ఈకలు తలోకటి పట్టి పీకి పారేస్తుంటే బతుకు జీవుడా అంటూ వెంటనే గన గూటికి ఎగిరిపోయింది.

అప్పుడే బయటి నుండి వచ్చిన తల్లి కాకిపిల్ల కాకి అవస్థను చూసి "అమ్మా! బిడ్డా! ఇదేంటే ఇలా నీ ఈకలన్నీ.." అని అడిగితే.. తనకు మర్కటాలవల్ల జరిగిన పరాభవమంతా చెప్పింది.

"అయ్యో బిడ్డా! ఆ మూర్ఖుల తెరువు ఎందుకుపోయానే. ముందే అవి కోతి జాతి, అందులో తిక్కలో ఉన్నాయి. వాటికి మంచి చెప్తే అర్థం కాదు. పైగా ఇదిగో ఇలాంటి పనులే చేస్తాయి. బిడ్డా! జీవితంలో గుర్తు పెట్టుకో మంద బుద్ధి గలవారికి ఉచిత సలహాలు ఇవ్వొద్దు. అసలు మూర్ఖుల తెరువే పోవద్దు. వారి తెరువు పోవడమే మూర్ఖత్వం చెప్తే వినని వాళ్ళని చెడిపోగా చూడాలే గాని వారిని గురించి అసలే పట్టించుకోరాదు తెలిసిందా!" అని చెప్తూ.పిల్ల కాకిని తన రెక్కల చాటున దాచుకొని కూచుంది తల్లికాకి.

**నీతి: మూర్ఖుల తెరువుపోవటం మనకే చేటు.**



–దారం గంగాధర్
సెల్:9848384777

